



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## యూరియా పంపిణీపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్లకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

5

ఏడీఆర్ రిపోర్ట్ వక్రీకరిస్తున్న వైసీపీ

- మంత్రి డా.డోలా

8



# ఎప్పటికీ మరువలేనిది గురువులనే!

- భక్తవత్సలం నా జీవితంలో స్ఫూర్తినింపారు..
- నిత్య విద్యార్థిని.. రోజూ ఏదోకటి నేర్చుకుంటా
- లోకేశ్ చదువుల క్రెడిట్ నా భార్యదే..
- టీచర్ల బదిలీల్లో కౌన్సిలింగ్ తెచ్చింది నేనే
- నేనుండగా ఉద్యోగులకు ఏ ఇబ్బందీ రానివ్వను
- పిల్లల్లో సృజనాత్మకతను పెంచే బాధ్యత గురువులదే
- టీచర్స్ డేలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- విజయవాడ ఏ-కన్వెన్షన్‌లో ఘనంగా గురుపూజోత్సవం
- 175మంది ఉత్తమ టీచర్లకు అవార్డుల అందజేత

2



## అనుక్షణం అప్రమత్తం

- తురకపాలెంలో హెల్త్ ఎమర్జెన్సీలా స్పందించండి
- వరుస మరణాలపై మరింత లోతైన పరిశోధన
- నేడు, రేపు 42 వైద్య పరీక్షలు నిర్వహించాలి..
- 72 గంటల వ్యవధిలో హెల్త్ ప్రొఫైల్స్ సిద్ధం కావాలి
- కొత్త కేసులు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోండి
- గ్రామస్థులలో ఆరోగ్య నమ్మకాన్ని పెంచాలి..
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

5

## సూపర్ సిక్స్-సూపర్ హిట్

బాబు ష్యూరిటీ- లబ్ది గ్యారంటీ

3

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో తొలి ఏడాదే అత్యధిక భాగం హామీలు అమలు చేసింది చంద్రబాబు ప్రభుత్వం తప్ప మరేది లేదు. జగన్ 85శాతం హామీలు ఎగనామం పెట్టాడు. నవమోసాలు చేశారు.



## ఏపీకి మరింత చేయూత!

- పెట్టుబడుల సాధనకు సహకారం
- ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలకు మార్గదర్శనం
- ప్రధాని మోదీకి మంత్రి లోకేష్ విజ్ఞప్తి
- ప్రధానితో మర్యాద పూర్వక భేటీ
- ప్రస్తుతం అందిస్తున్న సహాయ,సహకారాలకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేష్

8



## ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం

- మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలతో వివాదాలకు పరిష్కారం
- విశాఖలో ఏడీఆర్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధం
- ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు

4

## మరింత దిగజారిన వైసీపీ

- గురువుల పట్ల నీతిబాహ్యమైన చర్యలు
- వేరే రాష్ట్రంలో జరిగిన సంఘటన ఫొటోతో ఫేక్ ప్రచారం
- పదేపదే అదే తప్పు చేస్తున్న సైకో పార్టీ
- మంత్రి లోకేష్ మండిపాటు
- తగిన బుద్ధి చెప్పాలని టీచర్లకు వినతి

8

ప్రభుత్వ విద్య ప్రస్తావనొస్తే..

## ఏపీ గురించే మాట్లాడుకోవాలి

- ఐక్యంగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను సాకారం చేద్దాం
- నేను స్టాన్‌ఫోర్డ్‌కు వెళ్లానంటే కారణం నా టీచర్లే..
- సర్కారీ స్కూళ్లముందు నో అడ్మిషన్ బోర్డులు టీచర్ల ఘనతే..
- లీప్ మోడల్‌ను పకడ్బందీగా అమలు చేయాలి
- డీఎస్సీ అంటే చంద్రబాబు.. చంద్రబాబంటేనే డీఎస్సీ
- గత ప్రభుత్వంలో టీచర్ల దుస్థితి మర్చిపోవద్దు..
- వైన్ షాపులముందు కాపలా కాసే పరిస్థితిని చూశారు

6



- గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్‌పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలి
- విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ భావోద్వేగ ప్రసంగం
- విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా గురుపూజోత్సవం
- సీఎం చంద్రబాబుతో కలిసి 175మంది ఉత్తమ టీచర్లకు అవార్డుల అందజేత

# ఎప్పటికీ మరువలేనిది గురువులనే!

- భక్తవత్సలం నా జీవితంలో స్ఫూర్తినింపారు..
- నిత్య విద్యార్థిని.. రోజూ ఏదోకటి నేర్చుకుంటా
- లోకేశ్ చదువుల క్రెడిట్ నా భార్యదే..
- టీచర్ల బదిలీల్లో కౌన్సిలింగ్ తెచ్చింది నేనే
- నేనుండగా ఉద్యోగులకు ఏ ఇబ్బందీ రానివ్వను
- పిల్లల్లో సృజనాత్మకతను పెంచే బాధ్యత గురువులదే
- టీచర్స్ డేలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- విజయవాడ ఏ-కన్వెన్షన్‌లో ఘనంగా గురుపూజోత్సవం
- 175మంది ఉత్తమ టీచర్లకు అవార్డుల అందజేత



విజయవాడ (చైతన్య రథం): టీచర్లను జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. "పిల్లల్లో స్ఫూర్తిని కలిగించేది, మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి బయటకు తీసేది గురువులే. భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడు నా జీవితంలో స్ఫూర్తి నింపారు. నేను నిత్య విద్యార్థిని.. ప్రతి రోజూ ఏదోకటి నేర్చుకుంటా. సాధారణంగా రాజకీయ నాయకుల పిల్లలు చదువుకోరు. లోకేశ్ చదువు గురించి నా భార్యే చూసేది. ఆ క్రెడిట్ ఆమెదే. డీఎస్సీ అంటే ఎప్పుడూ జాప్యం చేయను. సమయానికి భర్తీ చేస్తా. ఒకప్పుడు టీచర్ల బదిలీలు జెడ్పీ చైర్మన్ చేతిలో ఉండేవి. టీచర్ల బదిలీల్లో కౌన్సిలింగ్ ప్రక్రియ తెచ్చింది నేనే. కొన్ని ఉద్యోగాల్లో పురుషులకంటే మహిళలే ఎక్కువ సంపాదిస్తున్నారు. తల్లికి వందనం పేరుతో పిల్లలు చదువుకునేందుకు అండగా ఉన్నాం. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం ఇస్తున్నాం" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## నేనుండగా ఉద్యోగులకు ఏ ఇబ్బందీ రాదు... రానివ్వను

"భారత్‌లో ఉన్న కుటుంబ విలువలు ప్రపంచంలో ఎక్కడా లేవు. భార్యాభర్తలు పరస్పరం గౌరవించుకోవడం.. పిల్లల కోసం కష్టపడటం ఎక్కడా లేవు. ఈ విలువలు కాపాడుకుంటే చాలు.. మన పిల్లలు ఏదైనా సాధిస్తారు. నేనుండగా ఉద్యోగులకు ఇబ్బంది రాదు.. రానివ్వను. ఉద్యోగుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యత నాది. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టీచర్లు తమ సిలబస్‌ను కూడా రీరైట్ చేసుకోవాలి. పిల్లలకు ఎలాంటి సిలబస్ అవసరమో రివైజ్ చేసుకోవాలి. టెక్నాలజీ విషయంలో నేటితరం పిల్లలు చాలా ఫాస్ట్ ఉన్నారు. సమాజంలో జరిగే మార్పులకు అనుగుణంగా కరిక్యులమ్ ఉండాలి. ఉపాధ్యాయులు కూడా నిత్యం అప్డేట్ కావాలి. పిల్లల్లో సృజనాత్మకతను పెంచే బాధ్యత గురువులదే" అన్నారు.

## అందుకే చుక్కా రామయ్యపై గౌరవం

"ఐఐటీ కోచింగ్ విషయంలో చుక్కా రామయ్య కచ్చితంగా ఉండేవారు. పదివేలమంది దరఖాస్తు చేస్తే వందమందికి ఐఐటీ శిక్షణ ఇచ్చేవారు. వందకు వందమందినీ ఐఐటీకి పంపేవారు. అదీ ఆయన గొప్పతనం. ముఖ్యమంత్రిగా నేను సిఫారసు చేసినా సీటు ఇవ్వబోనని చెప్పేవారు. అందుకే చుక్కా రామయ్య అంటే గౌరవం పెరిగింది. పిలిపించి మాట్లాడా, మీ కోచింగ్ ప్రత్యేకత ఏమిటని అడిగి తెలుసుకున్నా" అని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

- పిల్లలకు ఆస్తులివ్వడం కన్నా చదివిస్తే ఊహించనంత ఎత్తులకు ఎదుగుతారు.
- ప్రతి పాఠశాలలో ఓ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలి.
- పాఠశాల పాత స్టూడెంట్‌తో పాటు తల్లిదండ్రులను అందులో భాగస్వామ్యం చేయండి.
- 2014-19 మధ్య రాష్ట్రం కోసం కష్టపడ్డాను. కానీ తర్వాత రకరకాల కారణాల వల్ల ఓటమి చూశాను.
- నేను రాజకీయాలపై ఫోకస్ పెట్టిన ప్రతిసారీ గెలిచాను.
- 2019-24 మధ్య కాలంలో రాష్ట్రానికి విభజనకంటే ఎక్కువ నష్టం జరిగింది.
- 2024లో ప్రజలు మాపై నమ్మకంతో గెలిపించారు... 94 శాతం స్ట్రైక్‌రేట్ ఇచ్చారు.
- ప్రజలకు మరింత మేలు కలిగేలా పని చేస్తున్నాం.
- కేంద్ర సాయంతో ఏపీని అభివృద్ధి చేస్తాం. పెట్టుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తాం.
- నా ప్రయత్నాలకు టీచర్ల సహకారం అవసరం. టీచర్ల చేతుల్లోనే భవిష్యత్ ఉంటుంది.
- ఏ విషయంలోనైనా కాస్తో కూస్తో నిర్లక్ష్యం చేస్తానేమో కానీ... విద్యాశాఖను నిర్లక్ష్యం చేయను.
- మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టాను. వివాదాలు లేకుండా అద్భుతంగా డీఎస్సీ నిర్వహించారు.
- విద్యా వ్యవస్థలో చాలా మార్పులు తెచ్చానన్న సంతృప్తి ఉంది.
- ఒకప్పుడు విద్యా వ్యవస్థ జెడ్పీ ఛైర్మన్ల చేతుల్లో ఉండేది. ట్రాన్స్‌ఫర్ల కోసం టీచర్లు జెడ్పీ ఛైర్మన్ల ప్రాపకం కోసం వెళ్లేవారు.
- విధిలేని పరిస్థితుల్లో టీచర్లు రాజకీయ నాయకుల చుట్టూ తిరిగేవారు.
- టీచర్లు ఆత్మగౌరవం దెబ్బతినకూడదనే.. ట్రాన్స్‌ఫర్లల్లో తొలిసారి కౌన్సిలింగ్ విధానం తెచ్చాను.
- బ్రిడ్జి స్కూళ్లు పెట్టాం. బడికిపోదాం కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించాం.
- ఇప్పుడు తల్లికి వందనం ద్వారా పేద విద్యార్థులకు చదువు అందేలా చేస్తున్నాం.
- కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో చక్కటి సంస్కరణలు తెచ్చాం.
- రాజకీయ నేతల పేర్లను పెట్టకుండా... విద్యా వ్యవస్థను పవిత్రంగా ఉంచుతున్నాం.
- సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మవంటి పేర్లతో విద్యా వ్యవస్థను తీర్చిదిద్దడం శుభ పరిణామం.
- పిల్లలకు పుస్తకాల బరువు తగ్గేలా నో బ్యాగ్ డే ప్రవేశపెట్టారు.
- పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు... విలువలు నేర్పాలి.
- సంపదతో పాటు... విలువలు కాపాడుకోగలిగితే అన్నింటిలోనూ.. అగ్రభాగాన ఉండగలం.
- జీతాలిస్తున్నాం కానీ... ఇంకా ఆర్థిక ఇబ్బందులున్నాయి.
- నేను ఏ పరిస్థితుల్లో సీఎం అయ్యానో మీకు తెలుసు.
- ప్రజలకు హామీలిచ్చాం. నేను సీఎంగా ఉన్నప్పుడు ఉద్యోగస్తులను ఇబ్బంది పెట్టలేదు.. ఇబ్బంది రానివ్వను.
- ఉద్యోగులు, టీచర్లు ఈ ప్రభుత్వంనుంచి ఏం ఆశిస్తున్నారో... అవన్నీ రానున్న రోజుల్లో అందించే బాధ్యత తీసుకుంటాం.
- ఒకప్పుడు ఐటీ అర్థమయ్యేది కాదు... కానీ ఇప్పుడు ఐటీ రియాల్టీ.
- టీచర్లు ఐటీ నాలెడ్జ్ కూడా పెంచుకోవాలి. టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి.
- ఏఐ వంటి టూల్స్ ఉపయోగించి విద్యార్థులకు చాలా నేర్పించవచ్చు.
- క్వాంటం కంప్యూటింగ్ తెస్తున్నాం. క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం.
- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేసుకోవాలి.
- పిల్లలు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు. కొన్ని విషయాల్లో నాకంటే నా మనవడు దేవాన్ష్ ఫాస్టుగా ఉంటాడు.
- అలాగే టెక్నాలజీ విషయంలో మీకంటే.. పిల్లలు వేగంగా ఉంటే.. అది టీచర్లకు ఛాలెంజ్‌లాంటిది.
- యువత అవసరాలను... ప్రస్తుత ట్రెండ్సును తెలుసుకుంటూ అప్డేట్ కావడం నాకూ.. మీకూ అవసరం.
- థియరీనే కాకుండా... వినూత్నమైన ఆలోచనలతో చదువు చెప్పాలి.
- టెక్నాలజీ విషయంలో నాకంటే లోకేష్ మెరుగు. నేను థియరిటికల్ పర్సన్.. విజన్ ఉంది.
- కంప్యూటర్ సైన్స్ బ్యాక్ గ్రౌండ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ ఎంబీఏ పట్టా లోకేష్‌కు అడ్వాంటేజ్.
- అయితే లోకేష్ నాతో పోటీ పడడమంటే చాలా కష్టం.
- టీచర్ల బాగోగులు చూసుకునే బాధ్యత నాది. విద్యార్థుల బాధ్యత టీచర్లది. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి.
- నాకంటే వేరే రాష్ట్రం మెరుగ్గా ఉంటే నేను తట్టుకోలేను.
- ఎప్పుడూ రాష్ట్రాన్ని నెంబర్-1గా ఉండాలనే కోరుకుంటున్నా.
- రాష్ట్రాన్ని నెంబర్-1గా చేసేందుకు అవసరమైన వసతులు కల్పించే బాధ్యత నాది. దాన్ని అందిపుచ్చుకునే బాధ్యత టీచర్లది.
- మహిళల ఉన్నతికి బాటలు వేశాం. మహిళలకు విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశాం.
- డ్వాక్రాతో మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేశాం. ఆర్టీసీ కండెక్టర్లుగా మహిళలను నియమించాం.
- ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, స్త్రీశక్తి కింద ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం.
- మగవారి కంటే ఎక్కువ ఆడవారే ఎక్కువ సంపాదిస్తున్నారు. ఇది నాకు సంతోషం కలిగిస్తోంది.
- తల్లికి వందనం పథకానికి రూ. 10వేల కోట్లు వెచ్చిస్తున్నాం.



- (మిగతా వివరాలు 4లో)

# మరో మూడు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని మరో మూడు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించారు. బ్రాహ్మణ సంక్షేమ-అభివృద్ధి కార్పొరేషన్, వడ్డెర సంక్షేమ-అభివృద్ధి కార్పొరేషన్, నగరాలు సంక్షేమ-అభివృద్ధి కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో కార్పొరేషన్‌లో 15 మంది చొప్పున మొత్తం 45 మంది డైరెక్టర్లను నియమించారు.

### 1.ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పోరేషన్ లిమిటెడ్

| పేరు | నియోజకవర్గం | పార్టీ |
|---|---|---|
| 1.ఆకెల్ల వెంకట నారాయణ మూర్తి | అమలాపురం | జనసేన |
| 2. భువనేశ్వరి ప్రసాద్ వూచి | నెల్లూరు సిటీ | టిడిపి |
| 3. చివుకుల దుర్గాప్రసాద్ | బాపట్ల | టిడిపి |
| 4. ధార్వాడ ఆనందరావు | కర్నూలు | టిడిపి |
| 5. జి. బాబురావు | మంత్రాలయం | టిడిపి |
| 6. కృష్ణమోహన్ సాబ్నివీసు | తాడేపల్లిగూడెం | టిడిపి |
| 7. ఎం.ఆర్ పద్మ కోల్చున్ | నరసాపూర్ | టిడిపి |
| 8. రంజిత్ కుమార్ నాయికో | కురుపాం | టిడిపి |
| 9. ఆర్.ఎస్.ఎస్ వర ప్రసాద్ డింత్యాల | గుడివాడ | టిడిపి |
| 10. ఎస్.కె. శ్రీనివాసరావు | పాణ్యం | టిడిపి |
| 11. సురేష్ కుమార్ సరేపాక | చీపురుపల్లి | టిడిపి |
| 12. సురేష్ బాబు పోతూరి | వినుకొండ | టిడిపి |
| 13. సూర్యప్రభ వేదుల | అనకాపల్లి | టిడిపి |
| 14. తేజోమూర్తుల నాగలక్ష్మీ నరసింహమూర్తి | రాజమండ్రి సిటీ | జనసేన |
| 15. వెలగలేటి గంగాధర్ | గుంటూరు | బీజేపీ |

### 2.ఆంధ్రప్రదేశ్ వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్

| | | |
|---|---|---|
| 1. బత్తల కృష్ణయ్య | నెల్లూరు సిటీ | బీజేపీ |
| 2. బత్తుల వెంకటేశ్వరరావు | విజయవాడ వెస్ట్ | జనసేన |
| 3. డి. శ్రీనివాసులు | మదనపల్లె | టిడిపి |
| 4. దేవళ్ల భాస్కరరావు | కందుకూరు | జనసేన |
| 5. దుర్గా మహాలక్ష్మి జెటిపేటి | మైలవరం | టిడిపి |
| 6. దుర్గారావు కొమెర | మాచర్ల | టిడిపి |
| 7. మల్లెం అంజమ్మ | చీరాల | టిడిపి |
| 8. మునిస్వామి వలిపి | సర్వేపల్లి | టిడిపి |
| 9. పార్వతమ్మ తాళ్ళూరి | జగ్గయ్యపేట | టిడిపి |
| 10. పెద్దన్న | కుప్పం | టిడిపి |
| 11. రమణయ్య దేరంగుల | రాయచోటీ | టిడిపి |
| 12. శ్రీదేవి వి | హిందూపురం | టిడిపి |
| 13. తమ్మిశెట్టి రమాదేవి | ఒంగోలు | టిడిపి |
| 14. వల్లిపి శ్రీనివాసులు | పుట్టపర్తి | టిడిపి |
| 15. వెంకటసుబ్బయ్య జి | కడప | టిడిపి |

### 3.ఏపీ నగరాలు వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్

| | | |
|---|---|---|
| 1. బంక నాగమణి | విజయవాడ వెస్ట్ | టిడిపి |
| 2. బేవర సాయి సుధాకర్ | విజయవాడ వెస్ట్ | టిడిపి |
| 3. కరణం దివాకర్ బాబు | విజయవాడ వెస్ట్ | జనసేన |
| 4. నల్లన వెంకు నాయుడు | నరసన్నపేట | టిడిపి |
| 5. నాగోతి అనిత | భీమిలి | టిడిపి |
| 6. పిల్లా కన్నం నాయుడు | ఆమదాలవలస | టిడిపి |
| 7. పిల్లా నారాయణమూర్తి | భీమిలి | జనసేన |
| 8. పిల్లా సూరిబాబు | నెల్లిమర్ల | టిడిపి |
| 9. పొతిన అప్పలరాజు | భీమిలి | టిడిపి |
| 10. పొతిన పైడిరాజు | విశాఖపట్నం | బీజేపీ |
| 11. సెనాల నానాజీ | శృంగవరపుకోట | టిడిపి |
| 12. సోమేశ్ మజ్జి | విశాఖపట్నం వెస్ట్ | టిడిపి |
| 13. సుకాసి కిరణ్ కుమార్ | విజయవాడ వెస్ట్ | టిడిపి |
| 14. సూర్యప్రకాశరావు నాగోతి | భీమిలి | టిడిపి |
| 15. తమ్మిన విజయ్ కుమార్ | గాజువాక | టిడిపి |

# సూపర్ సిక్స్ - సూపర్ హిట్
# బాబు ష్యూరిటీ - లబ్ధి గ్యారంటీ

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో తొలి ఏడాదే అత్యధిక భాగం హామీలు అమలు చేసింది చంద్రబాబు ప్రభుత్వం తప్ప మరేది లేదు. జగన్ 85శాతం హామీలు ఎగనామం పెట్టాడు. నవమోసాలు చేశారు.

**పింఛన్ల హామీ:** రూ.3 వేలనుంచి 4 వేలకు పెంపుదల. ఏప్రిల్ 2024 నుండి అమలు. దివ్యాంగులకు 3 వేలనుండి రూ.6 వేలకు పెంపు. కిడ్నీ/ తలసేమియాలాంటి వ్యాధులకు రూ.5వేల నుంచి రూ.10 వేలకు పెంపు. పూర్తి వైకల్యానికి రూ.5 వేల నుండి 15 వేలు.

**అమలు:** 100 శాతం హామీ అమలు. బకాయిలతో కలిపి మొదటి నెల రూ.7 వేలు అందజేయడమైంది. ఏడాదికి రూ.34 వేలు. 5ఏళ్లలో రూ.1,70,000 కోట్లు ఇవ్వబడుతుంది. జగన్ ఐదేళ్లల్లో ఇచ్చింది రూ.84 వేల కోట్లు మాత్రమే.

## సూపర్ సిక్స్ 1వ హామీ:

**తల్లికి వందనం:** స్కూళ్లకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు.

**అమలు:** ఇంట్లో ఎంతమంది పిల్లలంటే అంతమందికి రూ.15 వేల నుండి రూ.52 వేల వరకు ప్రతి తల్లి ఖాతాలో జమ చేయడమైంది. జగన్ ఒక్క బిడ్డకే ఇచ్చి ఇతర బిడ్డలకు మోసం చేశారు.
కూటమి ప్రభుత్వం 67 లక్షల మంది తల్లులకు ఇవ్వగా.. జగన్ ఇచ్చింది కేవలం 42 లక్షల మందికే. తల్లికి వందనం ద్వారా ఐదేళ్లల్లో మొత్తం రూ.40 వేల కోట్లు ఇస్తున్నది.

## 2వ హామీ:

**దీపం పథకం:** దీపం -2 ద్వారా ప్రతి ఇంటికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు సరఫరా.

**అమలు:** ఇప్పటికే 2 కోట్లకు పైగా ఉచిత గ్యాసు సిలిండర్లు సరఫరా చేయడమైంది. ఉచిత గ్యాస్‌కు ఐదేళ్లల్లో రూ. 12 వేల కోట్లు ఇవ్వబడుతుంది. జగన్ పాలనలో గ్యాస్ రేట్లు రెట్టింపు చేశారు.

## 3వ హామీ:

**యువగళం:** 20 లక్షల ఉద్యోగాలు/ రూ.3 వేల నిరుద్యోగ భృతి.

**అమలు:** మంత్రి లోకేష్ ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 9 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించారు.

- పారదర్శకంగా డిఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ నియామకాలు చేశారు.
- 6,100 పోలీసు ఉద్యోగ నియామకాలు జరిగాయి.
- ఉచిత ఇసుకవల్ల 40 లక్షల భవన నిర్మాణ కార్మికులకు ఉపాధికి భద్రత కలిగింది.
- వేదం అభ్యసిస్తున్న యువతకు రూ.3 వేలు భృతి ఇస్తున్నారు.
- జగన్ మెగా డిఎస్సీపై మాట తప్పాడు. ఒక్క డిఎస్సీ కూడా జరపలేదు.
- డిఎస్సీ ఉపాధ్యాయుల జీతాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయబడుతుంది.

## 4వ హామీ:

**అన్నదాత-సుఖీభవ:** ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం.

**అమలు:** మొదటి విడతగా 42 లక్షల రైతుల ఖాతాల్లో రూ.7 వేలు జమ చేయడమైంది. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇవ్వగా... జగన్ ఇచ్చింది రూ.13,500 మాత్రమే. అన్నదాత సుఖీభవకు చంద్రన్న ప్రభుత్వం రూ.13 వేల కోట్లు ఇస్తున్నది.

## 5వ హామీ:

**స్త్రీ శక్తి:** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.

**అమలు:** ఇప్పటికే 2 కోట్లకు పైగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారు. ఉచిత బస్సు ప్రయాణానికి రూ.8 వేల కోట్లు ఖర్చు చేయబడుతుంది.

## 6వ హామీ:

**ఆడబిడ్డ నిధి:** 19 నుండి 59 సంవత్సరాల మధ్య మహిళలకు నెలకు రూ. 1,500.

**అమలు:** పీ4 ద్వారా ఇప్పటికే 13,82,532 బంగారు కుటుంబాల్ని 2,00,011 మంది మార్గదర్శకులు దత్తత తీసుకోవడమైంది.

- ముఖ్యమంత్రి ఆగస్టు 15న సదస్సు నిర్వహించారు. 7 జిల్లాల్లో సదస్సులలో పాల్గొని పీ-4 విజయవంతానికి పట్టుదలగా కృషి చేస్తున్నారు.
- మహిళలకు ఇప్పటికే లక్ష కుట్టుమిషన్లు ఇచ్చారు.
- అంగన్‌వాడీలకు రూ.1.5 లక్షలు, హెల్పర్లకు రూ.40 వేలు గ్రాట్యూటీ మంజూరు చేశారు.
- డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పరిమితితో రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచడమైంది.

**అన్న క్యాంటీన్లు:** 204 అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడమైంది. లక్షలాది పేదలకు రూ.5లకే నాణ్యమైన ఆహారం అందించబడుతోంది.

-21 ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానం. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తిరిగి ప్రారంభం. టీటీడీలో నిత్యాన్నదానం కార్యక్రమం ప్రవేశపెట్టింది ఎన్టీఆరే.

**ఉచిత ఇసుక:** 40 లక్షల భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని. 125 వృత్తులు, వ్యాపారుల లబ్ధికి ఉచిత ఇసుక తోడ్పడుతోంది.

**విషపూరిత మద్యం రద్దు:** నాణ్యమైన మద్యంతోపాటు ధర రూ.99లకు తగ్గింపు. జగన్ కమిషన్ల కోసం మద్య నిషేధం హామీపై మాట తప్పాడు. విషపూరిత మద్యం సరఫరాకు అనుమతించి 30 వేల మాంగల్యాలు మంటగలిపారు. 35 లక్షలమంది ఆరోగ్యాలు నాశనం చేశారు.

**గృహనిర్మాణాలు:** దీపావళికి 3 లక్షల గృహాలు లబ్ధిదారులకు అందజేత. సంక్రాంతికి మరో 2 లక్షలు అందజేత. మార్చి 2026కు 5లక్షల గృహాలు లబ్ధిదారులకు అందజేత. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోపలే 10 లక్షల గృహాలు లబ్ధిదారులకు ఇస్తుండగా.. ఐదేళ్లల్లో జగన్ ఇచ్చింది కేవలం 2 లక్షలు మాత్రమే.

**గత ప్రభుత్వ బకాయిల చెల్లింపు:** ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, ధాన్యం బకాయిలు, నీరుచెట్టు, ఉపాధి హామీ వేతనాలులాంటి గత ప్రభుత్వ బకాయిలు రూ.40 వేల కోట్లు కూటమి ప్రభుత్వం ఇప్పటికే చెల్లించడమైంది.

**ధాన్యం సేకరణ:** సుమారు 68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి వారికి 18 వేల కోట్లకుపైగా 24 గంటల్లోనే రైతులకు చెల్లించడమైంది. జగన్ 3 నెలలకుగాని చెల్లించేవారు కాదు. ఇలా ఇప్పటికే 700లకు పైగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి ఒక రికార్డు సృష్టించడమైంది. భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడి కొనసాగుతుంది.

## అభివృద్ధి ప్రదాత చంద్రన్న

**రోడ్లు:** 20 వేల కిలోమీటర్ల రోడ్ల మరమ్మత్తులు, సీసీ, బిటి తదితర రోడ్లు మరో 7 వేల కిలోమీటర్లు నిర్మించడమైంది. వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది.

**పంచాయతీలు:** ఒకేరోజు 13,326 పంచాయతీల గ్రామసభల నిర్వహణ. రూ.4 వేల కోట్ల అభివృద్ధి పనులు. 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు 4 వేల కోట్లు విడుదల.

**హంద్రీ-నీవా:** రూ.3,870 కోట్ల ఖర్చుతో 738 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణా జలాలను కుప్పంకు అందించడమైంది.

**పోలవరం:** కేంద్రం నుంచి రూ.12,157 కోట్లు సాధించి, 81శాతం పోలవరం పనులు పూర్తిచేయడమైంది.

**ప్రజారాజధాని అమరావతి:** ప్రస్తుతం 13 వేలమంది కార్మికులు, సిబ్బంది కలిసి 2,500 యంత్రాలతో నిరంతరాయంగా పనులు చేస్తున్నారు. ప్రజారాజధాని అమరావతి 175 నియోజకవర్గాల్లోని యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించగలుగుతుంది.

ఇలా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సమపాళ్ళలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజల కళ్ల ముందు కనిపిస్తున్నది. ప్రజల అనుభవంలో ఉన్నది. అయినా జగన్ ముఠా తమ దోపిడీ నేరాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రభుత్వంపై అబద్ధాలతో ప్రచార దాడి చేస్తోంది. విద్వేషాలు రెచ్చగొడుతోంది. వీటిని తిప్పికొట్టి, ప్రభుత్వ విజయాలను క్షేత్రస్థాయిలో బ్రాండ్ చేసి స్వర్ణాంధ్రప్రదేశ్-2047ను సాధించుకోవాలి.



- గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

# ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం

- మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలతో వివాదాలకు పరిష్కారం
- విశాఖలో ఏడీఆర్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధం
- ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు



విశాఖ (చైతన్య రథం): ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ వ్యవస్థలో మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలే ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ద్వారా న్యాయం అందరికీ అందుబాటులోకి రావటంతోపాటు వేగంగా, సమర్ధవంతంగా చేరుతుందన్నారు. మీడియేషన్ అంశం భారత్‌కు కొత్తకాదని, తరాలుగా మనకు అందుబాటులో ఉందని గుర్తు చేశారు. పురాణాల్లో శ్రీకృష్ణుడు ఓ సమర్ధవంతమైన మీడియేటర్‌గా వ్యవహరించారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గతంలో మన పూర్వీకులు, గ్రామపెద్దలు సమర్ధంగా మీడియేషన్ ప్రక్రియను నిర్వహించేవారని గుర్తు చేశారు. "విశాఖపట్నంలో జ్యుడీషియల్, మధ్యవర్తిత్వరంగాలపై చారిత్రాత్మక కాన్ఫరెన్స్ నిర్వహించటం సంతోషదాయకం. ప్రజాస్వామ్యంలో భారతీయ న్యాయవ్యవస్థ ఓ మూల స్తంభం. రాజ్యాంగపరమైన హక్కుల్ని, చట్టాన్ని కాపాడే అత్యంత కీలకమైన వ్యవస్థ. నిబద్ధతకు, నిష్పాక్షికతకు, పారదర్శకతకు పెట్టింది పేరు. కొన్ని సమయాల్లో కాస్త ఆలస్యమైనా న్యాయం దక్కుతుందనే నమ్మకం ప్రతీ పౌరుడికీ ఉంది. భారత్ అత్యంత వేగంగా సంస్కరణల్ని అమలు చేస్తోంది. గత ఏడాదిగా ఏపీలో వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థలు తమ కార్యకలాపాలు ఏర్పాటు చేస్తున్నాయి. కంపెనీలు, వ్యవస్థలు వస్తున్న నేపథ్యంలో వివాదాల పరిష్కారానికి మీడియేషన్‌లాంటి ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థలు అందుబాటులోకి రావాలి. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ సిస్టం రావాలి. సులభంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు టెక్నాలజీని కూడా అందిపుచ్చుకోవాలి" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

## విశాఖలో ఏడీఆర్ ఎకో సిస్టం ఏర్పాటుకు సిద్ధం

విశాఖలో ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పెరిగిపోతున్న వివాదాలు, కేసుల పరిష్కారానికి కొత్తగా కోర్టులు ఏర్పాటు చేయటంతోపాటు మీడియేషన్, ఆర్బిట్రేషన్‌కు కొత్త వ్యవస్థలు రావాలని అభిప్రాయపడ్డారు.

ఇప్పటికీ చాలామంది పౌరులు కేసులు దాఖలు చేసి కోర్టులకు వెళ్లటం అవమానంగా భావిస్తారని.. అలాంటి పరిస్థితిలో మీడియేషన్ ప్రక్రియ చక్కని పరిష్కారమన్నారు. దేశం అమలు చేస్తున్న సంస్కరణలు, కొత్త వ్యవస్థలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వివాదాలు తగ్గించుకోవటమే ఆర్ధిక వ్యవస్థకు కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దానికి అనుగుణంగా వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొందించుకోవాల్సి ఉందన్నారు. ఈజ్ ఆఫ్ జస్టిస్ ప్రక్రియలో భాగంగా వర్చ్యువల్ హియరింగ్స్, ఈ-ఫైలింగ్, మొబైల్ అప్‌డేట్స్‌లాంటి సాంకేతికతను అమలు చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు హాజరయ్యారు.



# ఎప్పటికీ మరువలేనిది గురువులనే!





(2వ పేజీ తరువాయి)

- ప్రధాని మోడీ జీఎస్టీ సంస్కరణలు తెచ్చారు. వీటివల్ల వినియోగదారులకు భారీ వెసులుబాటు కలుగుతుంది.
- కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకుతీసుకెళుతున్నాం.
- 2047 నాటికి ప్రపంచంలో నెంబర్ వన్ స్థానానికి మన దేశం వెళ్తుంది. ప్రపంచంలో తెలుగుజాతి నెంబర్ వన్‌గా ఉంటుంది.
- నా ఆకాంక్షలు నెరవేరాలంటే టీచర్లంతా సహకరించాలి. ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

## గతానికి భిన్నంగా టీచర్స్ డే వేడుకలు

ఈ ఏడాది టీచర్స్ డే వేడుకలు ఆద్యంతం ఆహ్లాదంగా... సరదా సంభాషణలతో సాగింది. టీచర్లను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నవ్వులతో ముంచెత్తారు. తండ్రిగా చంద్రబాబు తనను ఎలా చదివించారో సభలో మంత్రి లోకేశ్ ప్రస్తావించారు. తాను చదువుకునే రోజుల్లో కొన్ని అంశాల్లో వెనుకబడితే... నేడు మంత్రిగా ఉన్న నారాయణను పిలిపించి బ్రిడ్జి కోర్సుల్లో శిక్షణ ఇప్పించారని మంత్రి లోకేశ్ నవ్వుతూ చెప్పారు. దీంతో సభ ఆహ్లాదంగా మారింది. తర్వాత మాట్లాడిన చంద్రబాబు కూడా లోకేశ్ గురించి నవ్వుతూ ప్రస్తావించారు. లోకేశ్‌కు చదువు చెప్పించిన ఘనత తన భార్యదేనంటూ క్రెడిట్ భువనేశ్వరికి ఇచ్చారు. స్టూటెంట్‌గా తన చిన్ననాటి అనుభవాలను మంత్రి లోకేశ్ పంచుకున్నారు. తనది రౌడీ బ్యాచ్, తాను బ్యాక్ బెంచ్ స్టూడెంట్టైనా... ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో భవిష్యత్తును తీర్చిదిద్దుకున్నానని చెప్పారు లోకేశ్. ఇక టెక్నాలజీపరంగా లోకేశ్ ముందున్నా... తనతో పోటీ పడలేరంటూ సీఎం ఛలోక్తులు విసిరారు. ఇక తాను తొలిసారి సీఎం అయినప్పుడు ఐఐటీ రామయ్యతో తనకు ఎదురైన అనుభవాలు చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. రామయ్య కోచింగ్ సెంటర్‌లో సీటు కోసం తాను సిఫార్స్ చేస్తే.. ఐఐటీ రామయ్య తిరస్కరించేవారని... అయినా ఐఐటీ రామయ్యపై తనకు కోపం రాలేదని... గౌరవం పెరిగిందని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. తనకు ఎకనామిక్స్ లెక్చరర్ పోస్ట్ ఆఫర్ చేస్తే రాజకీయాల్లోకి రావాలన్న కోరికతో ఆ ఉద్యోగాన్ని సున్నితంగా తిరస్కరించానని నాటి సంగతులను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.



# అనుక్షణం అప్రమత్తం

- తురకపాలెంలో హెల్త్ ఎమర్జెన్సీలా స్పందించండి
- వరుస మరణాలపై మరింత లోతైన పరిశోధన
- శని, ఆదివారాల్లో 42 వైద్య పరీక్షలు నిర్వహించాలి..
- 72 గంటల వ్యవధిలో హెల్త్ ప్రొఫైల్స్ సిద్ధం కావాలి
- కొత్త కేసులు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోండి
- గ్రామస్థులలో ఆరోగ్య నమ్మకాన్ని పెంచాలి..
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు



అమరావతి (చైతన్య రథం): గత రెండు నెలలుగా గుంటూరు జిల్లా తురకపాలెంలో అంతుచిక్కని వ్యాధితో సంభవిస్తున్న వరుస మరణాలపైనా, ఆ గ్రామంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైద్యారోగ్య శాఖాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో దీనిపై చర్చించిన ముఖ్యమంత్రి, అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. జూలై, ఆగస్ట్ నెలల్లో ఈ గ్రామంనుంచి 20మంది చనిపోవడానికి గల కారణాలపై మొదట దృష్టి పెట్టాలని... ముందుగా అనుమానిత లక్షణాలపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. అన్నికోణాల్లోనూ పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం శని, ఆదివారాలు ప్రత్యేక వైద్య బృందాలను తురకపాలెం పంపించాలని... గ్రామంలోని అందరికీ నిర్దేశిత 42 వైద్య పరీక్షలు నిర్వహించి సోమవారంనాటికి హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలన్నారు. అక్కడ ప్రజల్లో నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత వైద్యాధికారులదేనని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి... దీనిని హెల్త్ ఎమర్జెన్సీగా పరిగణించాలన్నారు. అనారోగ్య తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని ఆస్పత్రుల్లో చేర్పించి అత్యవసర చికిత్స అందించాలని ఆదేశించారు.

## కేంద్ర వైద్య బృందాల సాయం తీసుకోండి

సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 'ఎయిమ్స్ సహా కేంద్ర వైద్య బృందాలు రప్పించండి. అవసరమైతే అంతర్జాతీయ వైద్యుల సాయం తీసుకోండి. పీల్చే గాలి, తాగే నీరు, తినే తిండి, భూమి ద్వారా బ్యాక్టీరియా వ్యాపించే అవకాశం ఉంది. అప్రమత్తంగా వ్యవహరించండి. తురకపాలెంలో అందరికీ సురక్షిత తాగునీరు అందించండి. పరిశుభ్రమైన వాతావరణం, ఆహారంపై అవగాహన కల్పించండి.

ప్రతి రోగినీ వైద్య పర్యవేక్షణలో ఉంచాలి. హెల్త్ ప్రొఫైల్ నిరంతరం పర్యవేక్షించాలి. కొత్త కేసులు ఏమాత్రం నమోదుకాకూడదు. పరిస్థితులు నియంత్రణలోకి రావాలి. స్థానికుల్లో నమ్మకాన్ని పెంచాలి. జ్వరంతో బాధపడుతున్నవారి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండండి' అని సీఎం ఆదేశించారు.

## 72 గంటల్లో రిపోర్టులు

మరోవైపు తురకపాలెంలో ప్రస్తుతం ఉన్న కేసులను పరిశీలిస్తే 'మెలియోయిడోసిస్' లక్షణాలు ఉన్నట్టు వైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేశారు. రక్త నమూనాలు ల్యాబులకు పంపడం జరిగిందని... 72 గంటల్లో రిపోర్టులు వస్తాయని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. పశుపోషణపైనా ఎక్కువ మంది ఆధారపడటంతో పశువుల నుంచి ఏమైనా బ్యాక్టీరియా వ్యాప్తి చెందవచ్చనే కోణంలోనూ పరిశీలన జరుపుతున్నామన్నారు. తురకపాలెంలో డయాబెటిస్, హైపర్ టెన్షన్, కార్డియాక్, బ్రెయిన్ స్ట్రోక్‌వంటి వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని... అలాగే అక్కడ ఆల్కహాల్ వినియోగం అధికంగా ఉందని, స్టోన్ క్రషర్లు ఆ ప్రాంతంలో ఎక్కువగా ఉండటంతో వాతావరణ నాణ్యతను కూడా చెక్ చేస్తున్నామని వివరించారు. మొదట జ్వరం, దగ్గు, తర్వాత ఊపిరితిత్తులు దెబ్బతినడంవంటి లక్షణాలు ఎక్కువమందిలో సాధారణంగా కనిపిస్తున్నాయని అధికారులు చెప్పారు. యాంటిబయోటిక్స్ ఆరువారాలు నిరంతరాయంగా వాడటంవల్ల వ్యాధి నియంత్రణలోకి వస్తోందని చెప్పారు. దీనిపైన మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నామన్నారు. మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ కూడా పరిశోధన చేస్తోందని తెలిపారు.

మెలియోయిడోసిస్ ప్రధానంగా భూమిలోనూ, నిల్వ నీటిలో, తడి నేలలో ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో, వరదల సమయంలో వ్యాప్తి చెందుతుంది. డయాబెటిస్, కిడ్నీ, లివర్ సమస్యలు ఉన్నవారు... వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు... రైతులు, నీటిలో ఎక్కువగా పనిచేసేవారు ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్పారు. మట్టిలో, నీటిలో ఉన్న బ్యాక్టీరియా గాయాలు లేదా చర్మపగుళ్ల ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుందన్నారు. కాలుష్య నీరుతాగినా, ఒక్కోసారి శ్వాస ద్వారా కూడా సంక్రమించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# యూరియా పంపిణీపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్లకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం
- అధికారిక లెక్కలు, క్షేత్రస్థాయి నిల్వల్లో తేడా లేకుండా చూడాలి
- యూరియా నిల్వలు, సరఫరాలపై కలెక్టర్లతో మంత్రి టెలీ కాన్ఫరెన్స్
- కృష్ణా, బాపట్ల, కడప జిల్లాల్లో సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆదేశం



అమరావతి (చైతన్యరథం): యూరియా పంపిణీపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. యూరియా నిల్వలు, పంపిణీ, సరఫరాలపై కృష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, బాపట్ల, విజయనగరం, కడప, ఏలూరు, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుంచి శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో మంత్రి మాట్లాడుతూ  జిల్లాల్లో యూరియా సరఫరా సమస్యలపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ సమస్యలను అధిగమించాలని సూచించారు. అధికారిక లెక్కలు – గ్రౌండ్ లెవెల్ నిల్వల్లో ఎలాంటి తేడా లేకుండా పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. జిల్లాల్లో ఉన్న యూరియా నిల్వల వివరాలను తక్షణం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. కృష్ణా, బాపట్ల, కడప జిల్లాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నందున కలెక్టర్లు తక్షణం స్పందించి పరిష్కరించాలన్నారు. నిల్వలు ఎక్కువున్న ప్రాంతాల నుండి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు యూరియా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. రబీ సీజన్ కోసం 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను ఇప్పటికే రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గంగవరం, కాకినాడ పోర్టుల నుండి రాష్ట్రానికి రావాల్సిన 53 వేల మెట్రిక్ టన్నుల యూరియా సమయానికి చేరుకునేలా రాష్ట్ర అధికారులు, పోర్ట్ అధికారులు, రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సోషల్ మీడియా, వార్తా పత్రికల్లో వచ్చే తప్పుడు కథనాలపై వెంటనే స్పందించాలని, ప్రతిరోజూ వాస్తవాలు, యూరియా నిల్వల పరిస్థితిపై మీడియాకు వివరణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. యూరియా సరఫరాపై డయల్ యూవర్ కలెక్టర్ అనే కార్యక్రమానికి ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షాను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. పలు చోట్ల మన గ్రోమోర్ దగ్గర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక షాపులు ఏర్పాటు చేసి రైతులకు యూరియా అందేలా కలెక్టర్లు చొరవ చూపాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల వారీగా యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి పెడితే ఒక అంచనాకు వస్తామని, రైతులకు సులువుగా పంపిణీ చేసేందుకు అడ్డంకులు తొలుగుతాయన్నారు. మండలాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, రాబోయే 10 రోజుల వరకు యూరియా పంపిణీ సజావుగా జరిగేలా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు. అవరమైతే టోకెన్ పద్ధతిలో యూరియా పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో యూరియా పంపిణీ కి సంబంధించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ తయారుచేసి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షిస్తోందని మంత్రికి ఈఓ స్పెషల్ సీఎస్ రాజశేఖర్  తెలిపారు. ఈ టెలీకాన్ఫరెన్స్ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, కృష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, బాపట్ల, విజయనగరం, కడప, ఏలూరు, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు బాలాజీ, లక్ష్మీ షా,  స్వప్నిల్ దినకర్ పుడ్కర్, మురళి, అంబేద్కర్,  శ్రీధర్,  వెట్రిసెల్వి, చేతన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్య ప్రస్తావనొస్తే..

# ఏపీ గురించే మాట్లాడుకోవాలి



- ఐక్యంగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను సాకారం చేద్దాం
- నేను స్టాన్‌ఫోర్డ్‌కు వెళ్లానంటే కారణం నా టీచర్లే..
- సర్కారీ స్కూళ్లముందు నో అడ్మిషన్ బోర్డులు టీచర్ల ఘనతే..
- లీప్ మోడల్‌ను పకడ్బందీగా అమలు చేయాలి
- డీఎస్సీ అంటే చంద్రబాబు.. చంద్రబాబంటేనే డీఎస్సీ
- గత ప్రభుత్వంలో టీచర్ల దుస్థితి మర్చిపోవద్దు..
- వైన్ షాపులముందు కాపలా కాసే పరిస్థితిని చూశారు
- గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్‌పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలి
- విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ భావోద్వేగ ప్రసంగం
- విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా గురుపూజోత్సవం
- సీఎం చంద్రబాబుతో కలిసి 175మంది ఉత్తమ టీచర్లకు అవార్డుల అందజేత

విజయవాడ (చైతన్య రథ): ప్రభుత్వ విద్య గురించి ప్రస్తావించాల్సి వస్తే.. ఏపీ గురించే మాట్లాడాలని.. ఆ స్థాయికి మనమంతా కలిసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను సాకారం చేద్దామని విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మానవ వనరులు అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన గురుపూజోత్సవంలో సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. సీఎంతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 175మంది ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విద్యామంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "నా లైఫ్ టీచర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులందరికీ నమస్కారం. ఈరోజు ఈ కార్యక్రమం ఏర్పాటుకు కారణమైన ఉత్తమ ఉపాధ్యాయులు, కార్యక్రమానికి హాజరైన అందరికీ పేరుపేరునా నమస్కారాలు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ. తల్లి దైవం, తండ్రీ దైవం, గురువూ దైవమే. గురువులకే గురువు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విద్యావ్యవస్థకు, దేశానికి ఆయన అందించిన సేవలు స్మరించుకుందాం. రాధాకృష్ణన్ చెప్పినట్టు The true teachers are those who help us think for ourselves అనేది గురువులంతా ఆచరిస్తే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ మిషన్ (లీప్) కచ్చితంగా విజయవంతమవుతుంది" అన్నారు.

## చదువే.. పేదరికానికి దూరం చేసేది

"ఒక చిన్న కథ చెబుతాను. ఇది జరిగిన కథ. పందొమ్మిదేళ్ల యువకుడు 50 ఏళ్ల వ్యక్తికి డ్రైవరుగా వచ్చాడు. కారులో వెళ్తూ.. ఏం చదివావని అడిగాడు పెద్దాయన. టెన్త్ ఇంగ్లీషులో ఫెయిలయ్యానని చెప్పాడు డ్రైవర్. నేను హెల్ప్ చేస్తాను, పాసవ్వాలి అని చెప్పి... ఆఫీసు అయ్యాక డ్రైవరుకి ఇంగ్లీషు పాఠాలు చెప్పాడు పెద్దాయన. టెన్త్ పాసైన డ్రైవరుకి ఇంటర్ ఫీజు కట్టి పుస్తకాలిచ్చాడు. ఆఫీసు అయ్యాక డ్రైవరు ఇంటర్ పుస్తకాలు, పెద్దాయన లైబ్రరీ పుస్తకాలు పోటాపోటీగా చదివేవారు. ఇంటర్ అయ్యింది. ఈసారి బీఏ టార్గెట్. అదీ కంప్లీటైంది. పీజీ చెయ్ అన్నాడు పెద్దాయన. డ్రైవరు ఆలోచించాడు. తనను చదివిస్తున్న వ్యక్తి గ్రాడ్యుయేట్. పోస్ట్ గ్రాడ్యుయేషన్ అంటే అతన్ని దాటిపోతానేమో అని భయపడ్డాడు. పెద్దాయన డ్రైవరుకి విమానం టిక్కెట్టు కొని మరీ పరీక్షలకు పంపాడు. గొప్ప గురువులెప్పుడూ తమ శిష్యులు తమకంటే పైకి ఎదగాలని కోరుకుంటారు. టెన్త్ పోయిన ఆ అబ్బాయి పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఆ గొప్ప గురువు మిస్సైల్‌మేన్ అబ్దుల్ కలాం. ఆ డ్రైవర్ పేరు కదిరేశన్. చదువు ఒక వ్యక్తిని పేదరికం నుంచి బయటకు తీసుకువస్తుంది అనేందుకు ఇదొక



ఉదాహరణ. Teaching is a very noble profession that shapes the character, caliber, and future of an individual. If the people remember me as a good teacher, that will be the biggest honour for me అన్న A.P.J.Abdul Kalam స్ఫూర్తితో పనిచేస్తున్న గురువులందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నాను" అంటూ గురువులపట్ల తనకున్న అభిమానం, గౌరవాన్ని లోకేశ్ చాటుకున్నారు.

## నేను స్టాన్‌ఫోర్డ్ వరకు వెళ్లానంటే దానికి కారణం టీచర్లే..

మిమ్మల్ని చూసిన తరువాత నాకు స్కూల్ డేస్ గుర్తొచ్చాయి. నేను స్టూడెంట్‌గా ఉన్నప్పుడు బాగా అల్లరి చేసేవాడిని. మాది రౌడీ, గోల బ్యాచ్. మేం బ్యాంక్ బెంచర్స్. బ్యాక్‌బెంచ్ నుంచి స్టాన్‌ఫోర్డ్ వరకూ వెళ్ళానంటే అందుకు కారణం గురువులు చూపించిన దారి. నన్ను తీర్చిదిద్దింది మంజులా మేడమ్, ప్రిన్సిపల్ రమాదేవి. ఆ తర్వాత పి నారాయణ, ప్రొఫెసర్ రాజిరెడ్డి. ఈరోజు విద్యాశాఖ మంత్రిగా మీముందు ఉన్నానంటే కారణం ఈ నలుగురు. నేను మొదట గౌరవించేది నా తల్లిని, తర్వాత ఉపాధ్యాయులను. నేను విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత బెస్ట్ టీచింగ్ ప్రాక్టీసెస్ అమలు చేస్తున్న టీచర్లను వారానికి ఒకరిని పిలిచి షైనింగ్ టీచర్ పేరిట గౌరవిస్తున్నాను. వారినుంచి బెస్ట్ ప్రాక్టీసెస్ తెలుసుకుంటున్నాను" అంటూ తన అనుసరిస్తున్న విధానం, అనుభవాలను పంచుకున్నారు మంత్రి లోకేశ్.

## విద్యార్థుల సంఖ్య పెంచాలన్నపుడు టీచర్లు స్పందన అద్భుతం

"ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని నేనిచ్చిన పిలుపునకు టీచర్లు స్పందించిన తీరు అద్భుతం. కొంతమంది టీచర్లు స్కూటర్‌కు మైక్ కట్టుకొని ఊళ్లోని వీధులన్నీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం చేశారు. ఒక మహిళా టీచర్ మాట్లాడిన మాటలు నాకు బాగా గుర్తుండిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు పిల్లలను ఎందుకు చేర్చాలి అని ఒక జర్నలిస్టు మహిళా టీచర్‌ను అడిగినపుడు ఆమె ఇచ్చిన సమాధానం.. 'ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తే తల్లితండ్రులకు జీరో ఇన్వెస్ట్‌మెంట్, హై రిటర్న్స్' అని. ఎలాగని ప్రశ్నించిన జర్నలిస్టుకు.. 'ప్రైవేట్ స్కూల్‌లో చేర్పిస్తే ఫీజు కట్టాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజు జీరో. ప్రైవేట్ స్కూల్లో యూనిఫామ్, టై, బెల్ట్, షూస్, టెక్స్ట్ బుక్స్, నోట్స్ అన్నింటికీ డబ్బులు కట్టాలి. అదే గవర్నమెంట్ స్కూల్‌లో అయితే యూనిఫామ్, టై, బెల్ట్, షూస్, టెక్స్ట్ బుక్స్, నోట్స్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అన్నీ ఫ్రీ. అంతే కాదు మా దగ్గర క్వాలిఫైడ్ అండ్ క్వాలిటీ టీచర్లు ఉంటారు' అని ఆమె గర్వంగా చెప్పారు" అంటూ మంత్రి లోకేశ్ ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను భావోద్వేగంగా చెప్పారు.



## నో అడ్మిషన్స్ బోర్డుల ఘనత టీచర్లదే..

సీఎం చంద్రబాబు నాయకత్వంలో చరిత్రలో మొదటిసారి కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్స్ బోర్డులు పెట్టారు. అందుకు కారణం అక్కడ వర్క్ చేస్తున్న టీచర్ల గొప్పతనం. ముఖ్యమంత్రితో పనిచేయడం అంత తేలిక కాదు. ఎప్పుడూ లేనివిధంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాం. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, విద్యార్థులను అనుసంధానించాం. చాలామంది నేను విద్యాశాఖ మంత్రి అవుతున్నానంటే అవసరమా? అన్నారు. ఛాలెంజ్ అంటే ఇష్టమని వారికి చెప్పా. గడిచిన ఏడాదిలో విద్యాశాఖలో అనేక సంస్కరణలు తెచ్చాం. మీ అందరితో చర్చించే తీసుకొచ్చాం. అన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పడం లేదు. మీ స్వరం విన్న తర్వాతనే సంస్కరణలు తెచ్చాం. మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయి. వచ్చే నాలుగేళ్లు సంస్కరణలు ఉండవు" అంటూ లోకేశ్ స్పష్టం చేశారు.

## లీప్ మోడల్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ాజూూూా) లీప్ మోడల్‌ను పకడ్బందీగా అమలుచేయాలని కోరుతున్నా. కరిక్యులమ్‌లో అనేక మార్పులు తెచ్చాం. ప్రైమరీ స్కూల్స్‌లో తరగతికో ఉపాధ్యాయుడు విధానం తీసుకున్నాం. 9,600 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుచేశాం. సెమిస్టర్ వైజ్ టెక్స్ట్ బుక్స్‌ను అందిస్తున్నాం. ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి యోగా, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి కార్యక్రమాలు చేపట్టాం. ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ విద్యకు రాజకీయాలను దూరంపెట్టాం. ఇక్కడున్న బోర్డులో సీఎం ఫోటో కూడా లేదు. పిల్లల యూనిఫామ్స్, పుస్తకాల్లో రాజకీయ నేతలు ఫోటోలు లేవు. వివిధ కార్యక్రమాలకు గొప్ప వాళ్ల పేర్లు పెట్టాం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు పెట్టాం. కడప జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం కోసం సెంట్రలైజ్డ్ కిచెన్ మోడల్ ప్రారంభించాం. రాబోయే రోజుల్లో అద్భుతమైన న్యూట్రిషియస్ ఫుడ్ అందించేలా ముందుకు వెళు ్తన్నా"మని లోకేశ్ వివరించారు.

## డీఎస్సీ అంటే చంద్రబాబు.. చంద్రబాబంటే డీఎస్సీ

"పారదర్శకంగా టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తీసుకువచ్చాం. మొదటిసారి సీనియర్ లిస్ట్ ఫిక్స్ చేశాం. ఎప్పుడూ లేనివిధంగా ప్రమోషన్లు కల్పించాం. సుమారు 80శాతం ఉపాధ్యాయులు చంద్రబాబు హయాంలో నియమితులైన వారేనని బలంగా నమ్ముతున్నాను. డీఎస్సీ అంటే చంద్రబాబు. చంద్రబాబంటే డీఎస్సీ. 13 డీఎస్సీల ద్వారా లక్షా 80వేల మంది టీచర్లను నియమించారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. డీఎస్సీ అంటే ఎంత ఛాలెంజో మీ అందరికీ తెలుసు. డీఎస్సీ విషయంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా ఏడాదిలోనే పూర్తిచేయడం కష్టమైన పని. చంద్రబాబు డైరెక్షన్‌లో పూర్తిచేయడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులనూ అభినందిస్తున్నా.

- (మిగతా వివరాలు 7లో)




# ప్రభుత్వ విద్య ప్రస్తావనొస్తే..

# ఏపీ గురించే మాట్లాడుకోవాలి




(6వ పేజీ తరువాయి)

గతంలో ఇచ్చిన అన్ని డీఎస్సీ నోటిఫికేషన్లు చదవాలని చెప్పా. డీఎస్సీ ఆగకూడదని చెప్పా. ఇప్పటికే దాదాపు 70 కేసులు నమోదయ్యాయి. కానీ డీఎస్సీ ఎక్కడా ఆగలేదు. సెప్టెంబర్‌లో 16,347 మంది ఉపాధ్యాయులు టీచింగ్‌కు వస్తారు" అని మంత్రి లోకేశ్ వివరించారు.

## నైతిక విలువలు పెంపొందించేలా పాఠ్యాంశాల రూపకల్పన

చాగంటి కోటేశ్వరరావు నాయకత్వంలో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా పాఠ్యాంశాలు రూపొందించడం జరిగింది. ఇంటర్‌లో కరిక్యులమ్ రీవ్యాంప్ చేయడం జరిగింది. ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం.. యూనివర్సిటీల్లో నియామకాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది పూర్తిచేస్తాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రా యూనివర్సిటీ గతంలో 7వ స్థానంనుంచి ఇప్పుడు 4వ స్థానానికి చేరింది. స్టేట్ యూనివర్సిటీ కోటాలో ఫస్ట్ ర్యాంక్ వచ్చే దిశగా పనిచేస్తాం. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీలను బలోపేతం చేయాల్సిన అవసరముంది. కరిక్యులమ్ మెరుగుపర్చాలి. స్థానికంగా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు లింక్ చేయాలని సీఎం చెప్పారు. ఆ దిశగా ప్రయాణిస్తున్నా"మని లోకేశ్ వివరించారు.

## టీచర్లను వైన్ షాపుల ముందు కాపలా పెట్టించారు..

ఇక్కడున్న టీచర్లు ఒక విషయం ఆలోచించాలి. 2019నుంచి 2024 వరకు ఒక విచిత్రమైన పాలన చూశాం. ప్రతి రోజూ కొత్త సంస్కరణ తీసుకురావడంవల్ల దాదాపు 12 లక్షలమంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. న్యాస్, ఏఎస్ఆర్ నివేదికలో కూడా లెర్నింగ్ అవుట్ కమ్స్‌లో వెనుకబడిన పరిస్థితి. ఉపాధ్యాయులు వైన్ షాపులముందు కాపుగాసే పరిస్థితి కల్పించింది గత ప్రభుత్వం. టీచర్ల బదిలీల విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. ఉపాధ్యాయులను ఎలక్షన్ డ్యూటీ తప్పించాలని గత ఏడాది ప్రయత్నించింది. ఇన్ని కష్టాలను ఎదుర్కొని.. ఆంధ్ర రాష్ట్రంలో అద్భుత ఫలితాలు రాబోతున్నాయని మొత్తం దేశం మనవైపు చూసేవిధంగా మీరు చేసినందుకు ఉపాధ్యాయులందరికీ నా ధన్యవాదాలు" అని మంత్రి లోకేశ్ భావోద్వేగంతో ప్రకటించారు.

## గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్‌పై దృష్టి పెట్టాలి

"మంత్రిగా మీముందు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం నా ఉపాధ్యాయులు. అందుకే ఉపాధ్యాయుల ను కొన్ని విషయాలను కోరాలనుకుంటున్నాను. మొదటిది గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్. మన పిల్లలకు మ్యాథ్స్, లాంగ్వేజెస్‌లో బేసిక్స్ రావాల్సిన అవసరముంది. నేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. న్యాస్, అసర్ నివేదిక చూస్తే.. జాతీయ సగటుకంటే ఏపీ తక్కువగా ఉంది. ఇందులో చాలా ఇంప్రూవ్ కావాల్సిన అవసరం ఉంది. బ్రిడ్జి కోర్సులవల్ల నేను చాలా నేర్చుకున్నాను. పిల్లలకు కూడా బ్రిడ్జ్ కోర్సు చాలా అవసరం. దీనివల్ల ఈ ఎవాల్యూషన్‌లో కూడా టాప్-3 రాష్ట్రాల్లో ఏపీ నిలబడాలని, ఇందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలి" అని టీచర్లను కోరారు.

## ప్రభుత్వ విద్యంటే.. ఏపీ గురించే మాట్లాడాలి

"పోటీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పెద్దఎత్తున ర్యాంకులు సాధించాలి. మనకు అద్భుతమైన ఉపాధ్యాయులు ఉన్నారు. కంటెంట్, మెటీరియల్ ఇస్తాం. మనకు వచ్చే పిల్లలు నిరుపేద కుటుంబాల నుంచి వస్తారు. వారికి సరైన దిశానిర్దేశం చేస్తే అద్భుతాలు ఆవిష్కరిస్తారన్న నమ్మకముంది. అది చేసి చూపించాల్సిన బాధ్యత మనందరిది. విద్యలో ఢిల్లీలో మేజిక్ జరుగుతోందని అంటున్నారు. దానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని నేను భావిస్తున్నా. ప్రభుత్వ విద్య గురించి ఎవరైనా మాట్లాడితే ఏపీ గురించే మాట్లాడాలి. చేసి చూపించే శక్తి మనందరికీ ఉంది. మనకు చాలా పాజిటివ్ లీడర్‌షిప్ ఉంది. అందరం కలసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను కేవలం దేశానికే కాదు.. ప్రపంచానికి చేసి చూపించాలని టీచర్లను కోరుతున్నా" అని లోకేశ్ ఉద్ఘాటించారు. కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ప్రభుత్వ చీఫ్ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, బోండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్, సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.














# గురువులకు అభివందనం

**టీచర్స్ డే సందర్భంగా సీఎం శుభాకాంక్షలు**




అమరావతి (చైతన్య రథం): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా.. భావితరాల బంగారు భవిష్యత్తును తీర్చి దిద్దుతున్న ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, ఉపాధ్యాయుడు, భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పిస్తూ జరుపుకునే పండుగ రోజిది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆచరించి చూపిన ఆదర్శాల నుంచి స్ఫూర్తిని పొందుతూ ఎందరో మహానుభావులు ఉపాధ్యాయ వృత్తికి పునరంకిత మౌతున్నారు. పిల్లల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న వారందరికీ అభినందనలు తెలుపుతున్నాను. అదే అంకితభావంతో పనిచేస్తూ ముందుతరాలకు మీరంతా మార్గదర్శులు కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. మరొక్కమారు అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రికి కొత్త హెలికాప్టర్



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రత, సమయం ఆదా దృష్ట్యా కొత్త హెలికాప్టర్‌ను వినియోగిస్తున్నారు. రెండు వారాలుగా ఇందులోనే జిల్లాల పర్యటనలకు వెళ్తున్నారు. ఇటీవలి వరకు వాడిన బెల్ తయారీ ఛాపర్ పాతది కావడంతో అధునాతన ఫీచర్లతో కూడిన ఎయిర్‌బస్ హెచ్-160 మోడల్ హెలికాప్టర్‌కు మారారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రయాణాలకు అనువుగా ఉంటుందని నిపుణులు దీన్ని ఎంపిక చేశారు. పాత ఛాపర్ ఎక్కువ దూరం ప్రయాణానికి వీలుండేది కాదు. సీఎం ఏదైనా జిల్లాకు వెళ్లాలంటే ఉండవల్లి నివాసంలోని హెలిప్యాడ్‌నుంచి ఛాపర్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడినుంచి ప్రత్యేక విమానంలో వెళ్లాల్సిన ప్రాంతానికి సమీపంలోని ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారు. అక్కడినుంచి మళ్లీ రోడ్డుమార్గంలో కార్యక్రమ వేదిక వద్దకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ముఖ్యమంత్రి నివాసంనుంచే హెలికాప్టర్లో జిల్లాల పర్యటనలకు వెళ్తున్నారు. దీనివల్ల చాలా సమయం ఆదాకానుంది. కొత్త ఛాపర్‌లో పైలట్లు కాకుండా ఆరుగురు ప్రయాణించే వీలుంది. రక్షణపరంగానూ ఎక్కువ సదుపాయాలున్నాయి.

# ముస్లిం సోదరులకు సీఎం శుభాకాంక్షలు




అమరావతి (చైతన్య రథం): 'మిలాద్ ఉన్ నబీ' జరుపుకుంటున్న ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టుపెడుతూ.. 'అజ్ఞానాన్ని పారద్రోలి.. అశేష ప్రజానీకంలో విశ్వాసం నింపిన మహమ్మద్ ప్రవక్త జన్మదినానికి గుర్తుగా నిర్వహించుకునే మిలాద్ ఉన్ నబీ ముస్లిం సోదరుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నీతి, నిజాయితీ, ప్రేమ, త్యాగంలాంటి అంశాలకు ప్రాధాన్యత నిస్తూ జీవితం కొనసాగించిన మహమ్మద్ ప్రవక్త ప్రవచించిన సూత్రాలను పాటించేందుకు ప్రేరణ కల్పించేది 'మిలాద్ ఉన్ నబీ'. సాటివారిని గౌరవిస్తూ, వారి ఆకలి తీర్చే పవిత్ర ఆశయాలు కొనసాగాలి. అందుకు ముస్లిం సోదరులు ముందు వరుసలో ఉండాలని ఆకాంక్షిస్తూ మరొక్క మారు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.

## ఓనం శుభాకాంక్షలు

ఓనం పండుగ శుభ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతో.. 'మన ఐక్యత బంధాలను పండుగ బలోపేతం చేయడమే కాదు, కరుణను పెంచాలి. ప్రకాశవంతమైన రేపటికి నాంది పలకాలని ఆకాంక్షిస్తున్నా' అని పేర్కొన్నారు.

# మహమ్మద్ ప్రవక్త బోధనలు సదా ఆచరణీయం

**- మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఈద్ మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు సదా ఆచరణీయం అన్నారు. సర్వశక్తివంతుడైన అల్లా ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# పెట్టుబడుల సాధనకు సహకరించండి

- ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలకు మార్గదర్శనం
- పరిశ్రమల స్థాపనకు చేయూత
- ప్రధాని మోదీకి మంత్రి లోకేష్ విజ్ఞప్తి
- ప్రధానితో మర్యాద పూర్వక భేటీ
- ప్రస్తుతం అందిస్తున్న సహాయ, సహకారాలకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేష్



న్యూఢిల్లీ (చైతన్యరథం): ప్రధాని నరేంద్ర మోదీతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు సహకారం అందించాలని కోరారు. ఏపీలో సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, రాష్ట్రంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాం, ఉన్నతవిద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మీ సహకారం, మార్గదర్శనం కావాలని కోరారు.



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15నెలలుగా మీ సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం, మీ నేతృత్వంలో వికసిత భారత్ - 2047లో భాగస్వాములం అవుతామని తెలిపారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీకి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ప్రధానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను మంత్రి లోకేష్ వివరించారు. ప్రధాని మోదీ స్పందిస్తూ... రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్ ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేష్ బహుకరించారు.

# మరింత దిగజారిన వైసీపీ

- గురువుల పట్ల నీతిబాహ్యమైన చర్యలు
- వేరే రాష్ట్రంలో జరిగిన సంఘటన ఫొటోతో ఫేక్ ప్రచారం
- పదేపదే అదే తప్పుచేస్తున్న సైకో పార్టీ
- మంత్రి లోకేష్ మండిపాటు
- తగిన బుద్ధి చెప్పాలని టీచర్లకు వినతి

అమరావతి (చైతన్యరథం): ఎంతో బాధ్యతాయుతంగా పని చేస్తూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను అతి నీచంగా చిత్రీకరిస్తూ వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్న వైసీపీ చర్యల్ని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఫేక్ హ్యాండిల్స్ ద్వారా ఫేక్ విషయాలను ప్రచారం చేసే వైసీపీ చర్యల్ని అర్థం చేసుకుని తగిన రీతిలో స్పందించాల్సిందిగా టీచర్లను కూడా కోరుతున్నానన్నారు. వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. వైసీపీ తన ఫేక్ హ్యాండిల్ లో ఒక ఫోటోను షేర్ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న టీచర్లు మద్యం తాగి బెంచీల కింద పడుకుంటున్నారన్న రీతిలో అతి జుగుప్సాకరంగా అందులో వ్యాఖ్యానం ఉంది. ఎక్కడో పక్క రాష్ట్రంలో ఏదో ఒక సందర్భంలో బయటకు వచ్చిన ఫొటోను ఆంధ్రప్రదేశ్‌లో జరిగినట్లు చెప్పడం, దానిపై దారుణంగా వ్యాఖ్యానించడం క్షమించరాని నేరం. ఇలాంటి నేరాలను ఇప్పటికే చాలా సార్లు వైసీపీ పాల్పడింది. విద్యా నేర్పే గురువుల పట్ల కూడా అతి నీచంగా వ్యవహరించిన వైసీపీ నీతిబాహ్యమైన చర్యల్తో మరో మెట్టు కిందికి దిగజారిందని మంత్రి లోకేష్ మండిపడ్డారు.

# గురువు దైవంతో సమానం

**- మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): ఎంతో ఓర్పుతో పాఠాలు చెబుతూ.. విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలిపే ప్రతి గురువు దైవంతో సమానం అని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మన సమాజంలో గురువుకు విశిష్ట స్థానం ఉంది. తల్లిదండ్రులు తర్వాత గురువును పూజిస్తాం. ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా దేశానికి వారు చేసిన సేవలను స్మరించుకుంటూ గురువులందరికీ మంత్రి లోకేష్ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఏడీఆర్ రిపోర్ట్ వక్రీకరిస్తున్న వైసీపీ

- జగన్‌లా మేమేమీ ప్రజల ఆస్తుల్ని లూటీ చేయలేదు
- తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని క్విడ్ ప్రోకో చేయలేదు
- మాపై మనీలాండరింగ్, సీబీఐ కేసులు లేవు
- నాడు వైసీపీ అరాచకాలు ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడినందుకే మాపై అక్రమ కేసులు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాబినెట్లో 96శాతం మందిపై క్రిమినల్ కేసులు అంటూ జగన్ మీడియాలో వచ్చిన కథనాలు హాస్యాస్పదమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి కొట్టేశారు. ఈవిషయంలో ఏడీఆర్ రిపోర్ట్‌ని వైసీపీ వక్రీకరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్‌లా మేమేమీ ప్రజల ఆస్తుల్ని లూటీ చేయలేదు, తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని క్విడ్ ప్రోకోకి పాల్పడలేదు. జగన్‌లా మాపై మనీలాండరింగ్, సీబీఐ కేసులు లేవు. మాపై కేసులన్నీ గత వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా, అక్రమంగా నమోదు చేసినవే, నాడు వైసీపీ అరాచకాలు ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడినందుకే అక్రమ కేసులు మోపి టీడీపీ నాయకుల్ని జగన్ జైలుకి పంపారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో అత్యాచార బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన టీడీపీ ఎస్సీ నాయకులపైనే ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టి జగన్ వేధించారు. ఇంతకంటే దుర్మార్గం మరొకటి ఉంటుందా? చంద్రబాబు నాయుడు ఏం తప్పు చేశారని అరెస్టు చేసి జైల్లో పెట్టారు? నాడు యువగళం పాదయాత్రలో లోకేష్‌పై అడుగడుగునా అక్రమ కేసులు నమోదు చేశారు. నాటి వైసీపీ క్యాబినెట్లో మంత్రులు అందరూ నేర చరిత్ర ఉన్నవారే, అందుకే ప్రజలు ఎన్నికల్లో వైసీపీకి పాడెకట్టారు. నేడు కూటమి పాలనలో మంత్రులందరూ ఉన్నత విద్యావంతులే. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి డా స్వామి స్పష్టం చేశారు.

# సూపర్ సిక్స్ హామీలను.. సూపర్ హిట్ చేశాం

**- అనంతపురం సభను గ్రాండ్ సక్సెస్ చేద్దాం**
**- మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు**

అమరావతి (చైతన్యరథం): అనంతపురంలో జరగనున్న 'సూపర్ సిక్స్..సూపర్ హిట్' సభను విజయవంతం చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు ఇచ్చారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన "సూపర్ సిక్స్..సూపర్ హిట్" కార్యక్రమ సన్నాహక కార్యక్రమంలో శుక్రవారం మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. అనంతపురంలోని షిరిడీ సాయి కళ్యాణ మండపంలో కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. చేసిన మంచిని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి నాయకునిపైనా ఉంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాం. ఆ కష్టాలపై ప్రజల తిరుగుబాటుకు ప్రతిఫలంగా 164 సీట్లతో కూటమిని గెలిపించారు. హామీ మేరకు జూలై నుండే రూ.4000 పెన్షన్ అందించాం. దివ్యాంగులకు రూ.6000, పూర్తిగా కదల్లేని స్థితిలో ఉన్న వారికి రూ.15 వేల చొప్పున పెన్షన్



అందిస్తున్నాం. దీపం పథకంతో రెండు కోట్ల మందికి ఉచితంగా గ్యాస్ సిలెండర్లు అందించాం. తల్లికి వందనంతో ప్రతి బిడ్డకి ఆర్థిక సాయం చేశాం. అన్నదాత సుఖీభవ పథకంతో 67 లక్షల మంది రైతులకు ఆర్థిక భరోసా అందించాం. ఉచిత బస్సు పథకంతో ప్రతి మహిళకు తోడుగా ఉంటున్నాం. సూపర్ సిక్స్ పథకాలు... సూపర్ హిట్ చేశాం. మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేశాం. అన్న క్యాంటీన్లతో పేదలకు కడుపు నింపుతున్నాం. పేదల భూములను స్వాహా చేసే కుట్రతో జగన్ రెడ్డి తెచ్చిన భూ భక్షక చట్టం రద్దు చేశాం. ఉచిత ఇసుక అమలుతో భవన నిర్మాణ రంగాన్ని ఆదుకున్నాం. మద్యం షాపుల్లో, బార్లలో గీత కులాల వారికి 10శాతం రిజర్వేషన్ కల్పించాం. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతో కుటుంబ సాధికార సారథుల నియామకాన్ని చేపట్టాం. బూత్, క్లస్టర్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకున్నాం.

కడపలో మహానాడు గ్రాండ్ సక్సెస్ చేశాం. అదే స్ఫూర్తితో అనంతపురంలో జరిగే సభను కూడా విజయవంతం చేయాలి. ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. అందులో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించాలి. రాష్ట్రానికి గత ఏడాది కాలంలో జరిగిన మంచిని ప్రజలకు వివరించాలి. ఏడాది కూటమి పాలనలో రాయలసీమకు హంద్రీనీవా ద్వారా నీళ్లు వచ్చాయి. పరిశ్రమలు వస్తున్నాయి. పెట్టుబడులు వస్తున్నాయి. కూటమిలోని అన్నిపార్టీల నాయకుల ఆధ్వర్యంలో సభను విజయవంతం చేసి, ఏడాది పాలనా ఘనతను వివరిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు ఇచ్చారు. అనంతరం రామ్ నగర్ 80 అడుగుల రోడ్డులో సభావేదికను, ఏర్పాట్లను పరిశీలించారు.

# బీసీ సంక్షేమ శాఖకు స్కోచ్ అవార్డు

**- హర్షం వ్యక్తం చేసిన మంత్రి సవిత**
**- బీసీలపై సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం ఈ అవార్డు**

అమరావతి (చైతన్యరథం): బీసీ సంక్షేమ శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు వరించింది. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ బీసీ యువతకు ఉచిత శిక్షణ అందజేసినందుకు గానూ 2025 సంవత్సరానికి సంబంధించి ఈ అవార్డు లభించింది. ఈ అవార్డును ఈనెల 20 తేదీన న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ, సివిల్ సర్వెసెస్‌కు ఉచిత కోచింగ్ అందజేశారు. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణ చేపట్టింది. అత్యధిక ఉపాధ్యాయ పోస్టులను బీసీ నిరుద్యోగ యువత సాధించాలన్న లక్ష్యంతో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించింది. ఈ ఉచిత శిక్షణ కేంద్రాల ద్వారా 1,674 మందికి కోచింగ్ అందజేశారు. వారికి నెలకు రూ.1500ల చొప్పున స్టయిపండ్,



పుస్తకాల కొనుగోలు మరో రూ.1000లు అందజేశారు. ఆన్‌లైన్ లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ నిర్వహించగా, 4,774 మంది ఈ శిక్షణను వినియోగించుకున్నారు. ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా 6,470 మందికి బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా మెగా డీఎస్సీ సన్నద్ధతకు ఉచిత శిక్షణ అందజేశారు. సివిల్ సర్వెసెస్‌కు కూడా 83 మంది బీసీ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం ఉచిత శిక్షణ అందజేసింది. ఈ శిక్షణల ద్వారా వందలాది మంది బీసీ అభ్యర్థులు టీచర్, గ్రూప్-1, రైల్వే సహా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలను సాధించగలిగారు.

**స్కోచ్ అవార్డు రాకపై మంత్రి సవిత హర్షం**

బీసీ సంక్షేమ శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు వరించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తం చేశారు. నిరుద్యోగ బీసీ యువతను ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నత స్థానాల్లో నిలపాలన్న లక్ష్యంతో మెగా డీఎస్సీ, సివిల్ సర్వెసెస్ కోచింగ్ అందజేసినట్లు తెలిపారు. ఉచిత శిక్షణ ద్వారా ఎందరో బీసీ అభ్యర్థులు పలు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు.

బీసీ యువత ఉన్నతికి సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి ఈ అవార్డు నిదర్శనమన్నారు. జగన్ ప్రభుత్వంలో బీసీలు తీవ్ర నిరాదరణకు గురయ్యారన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. బీసీల స్వయం ఉపాధి యూనిట్లు అందజేయకుండా నోట్లో మట్టికొట్టారన్నారు. నా బీసీలని చెబుతూనే వెనుకబడిన తరగతుల వారిని జగన్ ఓటు బ్యాంకుగానే చూశాడన్నారు. బీసీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఈ అవార్డు రాకతో తమపై మరింత బాధ్యత పెరిగిందని మంత్రి సవిత తెలిపారు.

## జీఎస్టీ స్లాబుల సరళీకరణ..

# పర్యాటక, సినిమా రంగాలకు ఊతం

**- రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**
**- ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు**

అమరావతి (చైతన్యరథం): దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడం కోసం జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న నాలుగు స్లాబుల (5%, 12%, 18%, 28%) స్థానంలో ఇకపై కేవలం రెండు స్లాబులు.. 5% 18% మాత్రమే అమలులోకి వస్తాయని తద్వారా ప్రజలకు నేరుగా లాభం కలగనుందని పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల ప్రభావం పర్యాటక, సినిమాటోగ్రఫీ రంగాలపై పడనుందన్నారు. వీటికి టాక్స్ తగ్గితే ఉపాధి పెరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. ప్రత్యేకించి హెూటల్ రూమ్ టారిఫ్‌లు రూ.7,500 లోపు ఉన్న వాటిపై



పన్ను 12% నుండి 5%కు తగ్గుతుందన్నారు. ఎకానమీ క్లాస్ విమాన టికెట్లపై 12% నుండి 5% కు తగ్గింపు ఉంటుందని, అదే విధంగా రెస్టారెంట్ బిల్లులపై పన్ను కూడా 12%-18% నుండి 5%కి తగ్గుతుందన్నారు. అంతేగాక బడ్జెట్ ట్రావెలర్, డొమెస్టిక్ టూరిజంలకు ప్రోత్సాహం లభిస్తుందని వెల్లడించారు. సినిమా రంగం విషయానికి వస్తే సినిమా టికెట్లు రూ.100 లోపు ఉంటే 12%, రూ.100 పైగా ఉంటే 18% జీఎస్టీ వర్తిస్తుందన్నారు. పాత 28% స్లాబు పూర్తిగా రద్దవుతుందన్నారు. సినిమా ప్రొడక్షన్ సేవలన్నీ 18% స్లాబ్ పరిధిలోకి లోకి వస్తాయని, ఇది నిర్మాతలకు ఆర్థికంగా మేలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ జీఎస్టీ సంస్కరణలు సాధారణ ప్రజలకు చవకైన ప్రయాణం, తక్కువ ధరల్లో వినోదం కలిగించడమే కాకుండా, పర్యాటక రంగం, సినిమా రంగం బలోపేతానికి దోహదం చేస్తాయని వివరించారు. అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చే సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మార్పులు సులభ పన్ను - బలమైన ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకునే దిశగా మైలురాయిగా నిలుస్తాయని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు




అమరావతి (చైతన్యరథం): ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 18న ఉదయం 9 గంటలకు శాసనసభ ప్రారంభం కానుండగా అదే రోజు ఉదయం 10 గంటలకు శాసనమండలి ప్రారంభం కానుంది. సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనేది ఉభయ సభలు వివివిడిగా బీఏసీ సమావేశాలు నిర్వహించి నిర్ణయించనున్నాయి.

## సీఎం చంద్రబాబుపై అనుచిత పోస్టర్లు

**- వైసీపీ అధికారిక సోషల్ మీడియాలో బరితెగింపు**
**- పోలీసులకు కర్నూలు ఐటీడీపీ నేత ఫిర్యాదు**



కర్నూలు (చైతన్యరథం): ప్రభుత్వ పథకాలపై సోషల్ మీడియా వేదికల్లో దుష్ప్రచారం చేస్తున్న వారిపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని సీఎం చంద్రబాబు ప్రకటించి 24 గంటలు గడవకముందే, వైసీపీ అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో అత్యంత దారుణమైన, అనుచితమైన పోస్టర్లు దర్శనమిచ్చాయి. వైసీపీ అధికారిక సోషల్ మీడియా పేజీలో శుక్రవారం.. నేర చరిత్రలో నంబర్ వన్ అంటూ, సీఎం చంద్రబాబు నాయుడుని లక్ష్యంగా చేసుకుని రక్తపు మడుగులో కొడవలి పట్టుకొని ఉన్న అవమానకరమైన చిత్రాన్ని పోస్ట్ చేశారు. ఇదే తరహా ఘటన గతంలో కూడా చోటుచేసుకుంది.

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య నేపథ్యంలో "నారాసుర రక్త చరిత్ర" పేరుతో ఇలాంటి పోస్టర్లు వైసీపీ అధికారిక పేజీలో పోస్ట్ చేశారు. తాజా పోస్టర్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ఐటీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ .. దీనిపై కర్నూలు మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాను దుష్ప్రచారానికి వేదికగా ఉపయోగిస్తూ రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసే వైసీపీ అధికారిక సోషల్ మీడియా పేజీపై తక్షణమే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ కర్నూలు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# సజ్జలది గోబెల్స్ ప్రచారం

- సూపర్ సిక్స్ సూపర్ హిట్
- వైసీపీ కార్యాలయానికి టూలెట్ బోర్డ్ ఖాయం
- వైసీపీ ప్రభుత్వ దోపిడీలో సజ్జల హస్తం
- త్వరలోనే అన్నీ బయటకు వస్తాయి
- రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్‌హిట్ అయ్యాయని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. వైసీపీ కార్యాలయం ముందు టూ లెట్ బోర్డు పెట్టడం ఖాయమని ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ..సీఎం చంద్రబాబుపై గత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలను చౌదరి తీవ్ర స్థాయిలో తిప్పికొట్టారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వస్తారని సజ్జల చేసిన ప్రకటన విడ్డూరంగా ఉందన్నారు. కేవలం 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న పార్టీకి ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని, రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో సజ్జల రామకృష్ణారెడ్డి ఒక 'రాజ్యాంగేతర శక్తి'గా వ్యవహరించి, ప్రభుత్వ యంత్రాంగాన్ని అవినీతి కేంద్రంగా మార్చారు. 151 మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ఉన్నప్పుడు వాళ్లు ఎందుకు మాట్లాడలేదు? నేడు గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలు ఎందుకు మౌనంగా ఉన్నారు? సజ్జల ఏనాడు ప్రజలచేత ఎన్నిక కాలేదు, కనీసం కార్పొరేటర్ స్థాయి ఎన్నికల్లో కూడా గెలవలేదు. అలాంటి వ్యక్తి ఏ హక్కుతో మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. జగన్‌కు 'డిఫాక్టో సీఎం'గా వ్యవహరించారు. తన కుమారుడితో కలిసి 'సైకో ఫ్యాక్టరీ' పేరుతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారు. "రిజిస్ట్రేషన్ లేకుండా, అకౌంట్ లేకుండా కంపెనీలు నడిపాం" అని సజ్జల స్వయంగా అంగీకరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం, ఇసుక, మైనింగ్ మాఫియాల్లో సజ్జల హస్తం ఉంది. దీనిపై వాస్తవాలు త్వరలోనే బయటకి వస్తాయి. గత ప్రభుత్వంలో ప్రతిపక్షాలపై పెట్టిన కేసులు.. మర్డర్, రేప్, దోపిడీ కేసులా అని ప్రశ్నిస్తూ, చంద్రబాబుపై ఒక్క కేసు కూడా రుజువు చేయలేకపోయారని బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.

### అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేదు

సజ్జల గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేదు. ధైర్యం ఉంటే అసెంబ్లీలోకి రండి, ప్రజల సమస్యలపై చర్చిద్దాం. మీకు కావాల్సినన్ని గంటలు మైక్ ఇసామని బుచ్చయ్య చౌదరి సవాల్ విసిరారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించడానికి ముందుకు రావడం లేదు.. బయట మాత్రం సాక్షి టీవీ, సాక్షి పేపర్లలో మాత్రం అసత్య ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పథకాలన్నింటినీ అమలు చేస్తోంది. ఏ రాష్ట్రంలో లేనంత పెద్ద మొత్తంలో పెన్షన్లు ఇస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 70 శాతం పైగా ఇప్పటికే నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందుకు వెళుతోంది. రైతులు, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని బుచ్చయ్య చౌదరి స్పష్టం చేశారు.

### కూలుతున్న అవినీతి కోటలు

తప్పుడు ఆరోపణలు, గోబెల్స్ ప్రచారాలు ఇకపై సాగవు. అటువంటి ప్రచారం చేస్తే గట్టిగా ఎదుర్కొంటాం. సజ్జల రామకృష్ణారెడ్డి అవినీతి కోటలు కూలిపోతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు త్వరలో తాళాలు వేయాల్సిన పరిస్థితి వస్తుంది. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని కులాల, మతాల ఆధారంగా విభజించి, బంధువులతో ప్రభుత్వ యంత్రాంగాన్ని నింపి వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. తెలుగుదేశం పార్టీ మాత్రమే నిజమైన సామాజిక న్యాయం చేస్తుంది. అన్ని వర్గాలకు అవకాశాలు కల్పిస్తుందని బుచ్చయ్య చౌదరి ఉద్ఘాటించారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు



అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మల్యాద్రి, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్, టీడీపీ ఎన్నారై విభాగం నాయకుడు చప్పిడి రాజశేఖర్, తదితరులు పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మల్యాద్రి మాట్లాడుతూ.. విద్యా రంగంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విశేష కృషి చేశారని కొనియాడారు. భారతీయ తత్వశాస్త్రానికి సర్వేపల్లి రాధాకృష్ణ పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారని తెలిపారు. ఆయన ఆదర్శాలకు అనుగుణంగా మన రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికతతో, మంత్రి నారా లోకేష్ సమర్థవంతమైన నాయకత్వంలో విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని తెలిపారు.

# ఇంకా సకలశాఖల మంత్రి అనే భ్రమలోనే సజ్జల

- ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ఎద్దేవా
- జగన్ నేరాల వ్యూహకర్త సజ్జలే
- సజ్జల భార్గవ్ నేతృత్వంలోనే సోషల్ మీడియా మాఫియా
- మద్యం కుంభకోణం, ఎర్ర చందనం స్మగ్లింగ్‌లోనూ పాత్రధారి
- అందరూ జైలుకెళ్లక తప్పదు



అమరావతి (చైతన్యరథం): వైసీపీ నేత, గత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రజలను భయపెట్టేలా సీఎం చంద్రబాబుపై, మంత్రి లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఏపీ లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజ్యాంగానికి అతీతంగా సకల శాఖల మంత్రిగా వ్యవహరించిన సజ్జల ఇంకా అదే పదవిలో ఉన్నట్లుగా భ్రమ పడుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ సలహాదారుగా ఉన్న సజ్జల.. ప్రజలు ఎన్నుకున్న నాయకుల గురించి పనికిమాలిన పదజాలం వాడటం సరికాదన్నారు. జగన్మోహన్ రెడ్డి దగ్గర సజ్జల బంట్రోతు. జగన్మోహన్ రెడ్డి చేసిన నేరాలకు వ్యూహ రచన సజ్జలదే. "సాక్షి" పత్రిక, టీవీలను ఉపయోగించి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి బాధ్యత ఉండాలనే ఉద్దేశంతో మర్యాదగా మాట్లాడుతున్నాం. ఇదే విధంగా మంత్రి లోకేష్‌పై పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మాణిక్యరావు హెచ్చరించారు.

### ప్రతిపక్ష హోదాపై సజ్జల మాటలు సిగ్గుచేటు

సజ్జల కుమారుడు భార్గవ్ రెడ్డి పలు నేరాలకు పాల్పడ్డారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా ఉండి ఫైబర్ నెట్ నిధులు దుర్వినియోగం చేశారు. పెద్ద మాఫియాను తయారు చేసి మహిళలు, వారి కుటుంబాల గురించి సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టించాడు. మద్యం కుంభకోణం, ఎర్ర చందనం స్మగ్లింగ్‌లో ఆయన పాత్ర ఉంది. సజ్జల రామకృష్ణారెడ్డి తండ్రిగా తన కొడుకును సరైన మార్గంలో నడిపించలేదు. సజ్జల తన కొడుకును నేరాల మార్గంలో నడిపించారు. దీనివల్ల భార్గవ్ జైలుకు వెళ్లే పరిస్థితి వచ్చింది. గత ఎన్నికల్లో కూటమికి ప్రజలు అద్భుతమైన మెజారిటీ ఇచ్చి, వైసీపీని పూర్తిగా తిరస్కరించారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా 11 సీట్లే ఇచ్చారు. ఇది వైసీపీ అరాచక పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పు. రాజకీయ పరిజ్ఞానం లేని, కనీసం ఒక కార్పొరేటర్‌గా కూడా గెలవని సజ్జల.. ప్రతిపక్ష హోదా గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ప్రజలు తిరస్కరించిన పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వమని అడగడం సిగ్గుచేటు. సజ్జల, భార్గవ్, జగన్‌తో సహా వైసీపీ నేతలందరూ చేసిన నేరాలకు తప్పకుండా జైలుకు వెళ్లక తప్పదు. భవిష్యత్తులో జైళ్లలో వైసీపీ నేరస్తుల కోసం ప్రత్యేక బ్యారక్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని మాణిక్యరావు ఎద్దేవా చేశారు.

# వినాయక మండపం వద్ద చికెన్ బిర్యానీ వడ్డిస్తారా

- వైసీపీ తీరుపై బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మండిపాటు
- హిందూ దేవతలకు అవమానంపై జగన్ నోరు విప్పాలి
- ఆయన మౌనానికి అర్థమేమిటి
- దేవుళ్లకు అపచారాలు, ఫేక్ ప్రచారాలే వైసీపీ నైజం



అమరావతి (చైతన్యరథం): గణేష్ మండపం వద్ద చికెన్ బిర్యానీ వడ్డించి భక్తుల మనోభావాలపై వైసీపీ నేతలు దాడి చేస్తున్నారని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా హిందువులు ఎంతో పవిత్రంగా జరుపుకునే పండుగ వినాయక చవితి అన్నారు. ఏ పని ప్రారంభించినా వినాయకుని పూజించడం మన సంప్రదాయం. భాద్రపద శుక్ల చతుర్దశి నాడు జరుపుకునే ఈ పండుగలో ప్రతీ ఊరిలో, ప్రతీ పట్టణంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసి, అష్టోత్తరాలు, సహస్రనామాలతో భక్తి పూర్వక వాతావరణం సృష్టిస్తారు. ఈ పండుగ అంటే మన భక్తి, మన విశ్వాసాలకు నిదర్శనం. కానీ, దురదృష్టవశాత్తూ వైసీపీ నేతలు ఎన్టీఆర్ జిల్లా నందిగామలో చేసిన ఘోరం ప్రతి హిందువును బాధపెట్టింది. పవిత్రమైన వినాయక మండపంలో చికెన్ బిర్యానీ వడ్డించడం ఏ మతపరమైన ఆచారాలకు, ఏ భక్తి భావాలకు నిదర్శనం? ఇది దేవుడిని అవమానపరిచే ప్రయత్నం కాదా? ఈ వ్యవహారంలో సాక్షాత్తూ వైసీపీకి చెందిన ఒక ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే ఉండటం మరింత బాధాకరం. ఇలాంటి విషయంలో జగన్ మోహన్ రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. రోజూ సొంత మీడియాలో చిన్నా పెద్దా విషయాలపై స్పందించే జగన్, హిందూ దేవతలకు జరిగిన అవమానంపై ఎందుకు నోరు విప్పలేదు? ఇది ప్రజల మనసులను బాధిస్తున్న పెద్ద సందేహమని బుచ్చి రాంప్రసాద్ పేర్కొన్నారు.

### ప్రజలు మరింత గట్టిగా బుద్ధి చెబుతారు

వైసీపీ ఐదేళ్ల పాలనలో హిందూ మతాన్ని దెబ్బతీసే చర్యలు, తిరుపతి దేవస్థాన పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నాలు, వర్గాల మధ్య విభజనలు సృష్టించే ఘటనలు వరుసగా జరిగాయి. ఇప్పుడు వినాయక మండపాల్లో జరిగిన ఈ ఘటన కూడా అదే కోవలో ఉంది. ఇదే కాకుండా, ప్రజలను మభ్యపెట్టడం, ఫేక్ ప్రచారాలు చేయడం వైసీపీ ప్రత్యేకత. కృష్ణమ్మ నీళ్లు కుప్పానికి చేరుకున్న సందర్భంలో కూడా తప్పుడు వీడియోలు సృష్టించి సీఎం చంద్రబాబుని, ప్రభుత్వాన్ని అపహాస్యం చేయడానికి ప్రయత్నించారు. వాస్తవానికి, కుప్పంలోకి నీళ్లు విడుదలైన తర్వాతే ఈ ఫేక్ వీడియోలతో ప్రజలలో గందరగోళం సృష్టించడానికి వైసీపీ ప్రయత్నించింది. ప్రజలు అయితే ఈ అబద్ధాల రాజకీయాలను సహించలేకే గత ఎన్నికల్లో వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పారు. అందుకే 151 సీట్లు ఇచ్చిన ప్రజలు, చివరికి వైసీపీకి 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. హిందూ మతం మీద దాడులు, దేవుళ్ల మీద అపచారాలు, ఫేక్ ప్రచారాలే ఆ పార్టీని ప్రజల దృష్టిలో దిగజార్చాయి. ఇప్పటికైనా వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. మత విశ్వాసాలను గౌరవించాలి. లేకపోతే ప్రజలు మరింత తీవ్రంగా బుద్ధి చెబుతారు. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం కూడా ఎంత మాత్రం మౌనంగా ఉండదు. కేసులు నమోదు చేసి తగిన చర్యలు తప్పక తీసుకుంటాం. హిందూ మతపరమైన విలువల పట్ల వైసీపీకి ఏ మాత్రం గౌరవం లేదని నందిగామ సంఘటన చాటిచెబుతోంది. రాబోయే రోజుల్లో ప్రజలు దీనికి గట్టిగా సమాధానం ఇస్తారని బుచ్చి రాంప్రసాద్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

●ఎంపీ సానా సతీష్‌బాబు కార్యాలయంలో 20వ ప్రజాదర్బార్



కాకినాడ (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు ఎంపీ సానా సతీష్‌బాబు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కొప్పవరంలోని రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు కార్యాలయంలో 20వ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పింఛన్లు, విద్య, ఇళ్ల స్థలాలు, ఉపాధి, వైద్యం తదితర అంశాలకు సంబంధించి మొత్తం 44 అర్జీలు అక్కడి సిబ్బంది స్వీకరించారు. వాటిలో 8 అర్జీలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించగా... 8 సంవత్సరాల పాప వైద్యం నిమిత్తం ఎల్‌వోసి కోరకు వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాయడం జరిగిందని కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో అరిగెల శ్రీనివాస్ (బుజ్జి) ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, ముత్యాల అనిల్, బండి నరేంద్ర, జున్నూరు బాబ్జి, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పి ఏ గౌరీ శంకర్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పలువురి గురువులకు సత్కారం

గురుపూజ దినోత్సవం సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు కార్యాలయంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులైన పెంకె వెంకటరమణ, ఎన్.వీర రాఘవరావులను ఘనంగా సత్కరించారు. ఈ సత్కారాన్ని పొందడం తమకు ఎంతో సంతోషంగా ఉందని విశ్రాంతి ఉపాధ్యాయులు తెలిపారు.

# ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే వెనిగండ్ల

●సీనియర్ ఉపాధ్యాయులకు ఘన సత్కారం చేసిన ఎమ్మెల్యే రాము



గుడివాడ (చైతన్యరథం): ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గొప్ప స్థానంలో ఉన్న ఉపాధ్యాయులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన పేర్కొన్నారు. కంచనపల్లి నాగ కుమారి టీచర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో... గుడివాడ ఎన్జీవో హోం ప్రాంగణంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాము... జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన సీనియర్ ఉపాధ్యాయులను సత్కరించి..నాగ కుమారి టీచర్ స్మారక జ్ఞాపికలను అందజేశారు. ముందుగా జరిగిన సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు.... ముందుగా ఉపాధ్యాయ వర్గాలకు ఎమ్మెల్యే రాము టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. టీచర్స్ డే అంటే ముఖ్యమైన రోజు అని అన్నారు. తల్లిదండ్రులు ఎంత ప్రోత్సహించిన... మన బంగారు భవితకి పునాదులు వేసేది గురువులేనని ఆయన అన్నారు. స్త్రీ, పురుషుల మధ్య సమాజంలో ఉన్న అంతరాన్ని తొలగించడంలో ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని, విద్యార్థి దశలోనే బాలికలలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా.... ఉపాధ్యాయులు తమ ఆలోచనలకు తగ్గట్టుగా వారిలో సృజనాత్మక శక్తిని పెంపొందించాలని సమావేశంలో ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులను గౌరవించుకునేలా ఇంతటి మంచి కార్యక్రమాలు నిర్వహించిన కుంచనపల్లి సుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్యే రాము అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, సీనియర్ టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, ఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, కైకలూరు ఎంఈఓ రామారావు, ట్రస్ట్ కన్వీనర్ కంచనపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి

రంపచోడవరం (చైతన్యరథం) : నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషదేవి నియోజకవర్గ పర్యటన నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10:00 గంటలకు వడ్డీగూడెం నుండి ప్రారంభమైన పర్యటన... కూనవరం వంతెన వద్ద చేరుకుని, బోటు ద్వారా అంతర్గ్రామాలకు ప్రయాణం కొనసాగించారు. తదుపరి చింతరేవుపల్లి గ్రామం, రామవరం గ్రామాన్ని సందర్శించారు. 20 కిలోమీటర్లు నాటు పడవపై మన ఎమ్మెల్యే ప్రయాణించి అక్కడ ప్రజల బాగోగులు తెలుసుకున్నారు. చాలా సాహసోపేతంగా ఎమ్మెల్యే పర్యటన సాగటంపై ముంపు గ్రామాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం, కూనవరం మండలంలోని విజయ భాస్కర్ కాలనీని పరిశీలించారు. సాయంత్రం 4:00 గంటలకు శబరి కొత్తగూడెంలో పర్యటనలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

# ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవి

●విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చిన "కూటమి"

●ఉపాధ్యాయ పోస్టులు, భర్తీల విషయంలో పారదర్శకం

●గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులకు చిత్రహింసలు

●తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి

●ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం



తణుకు (చైతన్యరథం): విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తణుకు నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను చిత్రహింసలకు గురి చేశారని ప్రధానంగా మద్యం షాపుల వద్ద నిలబెట్టిన దుస్థితి ఉండేదని అన్నారు. మరుగుదొడ్ల ఫోటోలు తీయించి ఆన్ లైన్ లో పొందుపరిచే విధంగా వారికి బాధ్యతలు అప్పగించడం వారిని అవమానించడమేనని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో తమ వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు జమ అయ్యేవిధంగా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గతంలో పెన్షనర్లు సైతం తన పెన్షన్ తీసుకునేందుకు నానా ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అత్యధికంగా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసిన ఘనత ప్రభుత్వానికే చెందుతుందని అన్నారు. 16,375 టీచర్ పోస్టులకు మెగా డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. విద్యకు కల్పిస్తున్న ప్రాధాన్యత ఇందుకు నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన అస్తవ్యస్తమైన జీవో 117 రద్దుచేసి విద్యా వ్యవస్థలో కూటమి ప్రభుత్వం మార్పులు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ బదిలీలు సైతం పారదర్శకంగా ఆన్లైన్ ద్వారా చేసిన ఘనత ప్రభుత్వానికి చెందుతుందని చెప్పారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో, ఉపాధ్యాయుల బదిలీల్లో రాజకీయ ప్రమేయం లేకుండా చేశారని అన్నారు. ప్రైవేటు విద్యా వ్యవస్థకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందిస్తున్న 32 మంది ఉపాధ్యాయులను ఎమ్మెల్యే రాధాకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జగన్ అసెంబ్లీకి రాకపోతే పులివెందులకు బై ఎన్నికల ఖాయం

● హెచ్చరించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



నర్సాపురం (చైతన్యరథం): ప్రతిపక్ష హోదా అడుగుతున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణరాజు హాట్ కామెంట్స్ చేశారు. జగన్ చంటి పిల్లాడని.. చందమామా కోసం మారాం చేసినట్లుగా ఆయన చేస్తున్నారని సెటైర్లు గుప్పించారు. జగన్ 60 రోజులు అసెంబ్లీ సమావేశాలకు రాకపోతే ఆటోమేటిక్‌గా డిస్ క్వాలిఫై అయిపోతారని ఎద్దేవా చేశారు. ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాలకు జగన్ రాకపోతే పులివెందుల అసెంబ్లీకి బై ఎలక్షన్ వచ్చే అవకాశం ఉండవచ్చని చెప్పుకొచ్చారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలో రఘురామ పర్యటించారు. ఈ సందర్భంగా రఘురామ మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు శాసనసభా సమావేశాలను బహిష్కరిస్తే ఆ పదవికి అర్హత లేనట్లుగానే భావించాలని పేర్కొన్నారు. వయసులో పెద్దవాడిగా, శాసనసభా ఉపసభాపతిగా సమావేశాలకు జగన్ రావాలని కోరుతున్నానని అన్నారు. ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాలకు రావడానికి జగన్ సిద్ధమా అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సవాల్ విసిరారని.. ఆ సవాల్‌ను జగన్ స్వీకరించాలని సూచించారు. వైసీపీ గెలిచిన 11 స్థానాలకు కూడా బై ఎలక్షన్ వచ్చే అవకాశాలు ఉన్నాయని రఘు రామ కృష్ణరాజు పేర్కొన్నారు.

# చిన్ననాటి గురువులను సత్కరించిన ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రణస్థలంలో తన చిన్ననాటి గురువులు మేదూరు సత్యనారాయణ, ఎంఎస్ఎన్ మూర్తి సత్యవతి దంపతుల ఇంటికి వెళ్లి ఘనంగా సన్మానించారు. పట్టు వస్త్రాలు సమర్పించి, ఆశీర్వాదం తీసుకున్నారు. చిన్నతనంలో తమ గురువులు వద్ద విద్యాభ్యాసం సమయంలో చోటుచేసుకున్న పలు విషయాలను గుర్తుచేసుకొన్నారు. గురువులు మంచి విద్యాభ్యాసం అందించిన కారణంగానే నేడు ఉన్నత స్థాయిలో ఉన్నానన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని, వారి సూచనలు అమలు చేయాలని ఆయన కోరారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

విజయనగరం (చైతన్యరథం): ఉపాధ్యాయ ఉద్యోగం వృత్తి కాదని, సమాజం రూపురేఖలు మార్చే శక్తి అని కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ చెప్పారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆయన వివరించారు. శుక్రవారం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కలెక్టరేట్లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 76 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తరగతి గదుల్లో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్ది ఉపాధ్యాయులు ఆదర్శవంతులుగా నిలవాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను కొనియాడారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందర్నీ అలరించాయి.



## మంత్రి నారా లోకేష్ కృషితో నియోజకవర్గంలో

# పరుగులుపెడుతున్న అభివృద్ధి పనులు

●తాడేపల్లి 17వ వార్డులో రజక కమ్యూనిటీహాల్ పనులు పునఃప్రారంభం

●గత ఐదు సంవత్సరాలలో కమ్యూనిటీహాల్‌ను పూర్తి చేయలేకపోయిన వైసీపీ

●మంత్రి నారా లోకేష్ చొరవతో ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించిన నాయకులు



తాడేపల్లి (చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు పేర్కొన్నారు. తాడేపల్లి 17వ వార్డులోని రైల్వేకట్ట వద్ద వైసీపీ ప్రభుత్వంలో ఆగిపోయిన రజక కమ్యూనిటీ హాలు పనులను టీడీపీ నాయకులు శుక్రవారం పునఃప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వంలో రజక కమ్యూనిటీహాలుకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించగా తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 5 సంవత్సరాలలో కూడా కమ్యూనిటీ హాలును పూర్తి చేయలేకపోయింది. దీంతో ఈ పెండింగ్ పనులను పూర్తిచేయాలని స్థానిక నాయకులు మంత్రి నారా లోకేష్‌ను కోరడంతో ఇటీవల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. తాడేపల్లికి చెందిన రజక నాయకులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో రజక సామాజిక భవన నిర్మాణానికి గ్రహణం పట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి గుత్తేదారు బేస్మెంట్‌తో పాటు పిల్లర్ల దశ వరకు పూర్తి చేయగా వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని అన్నారు. త్వరలోనే కమ్యూనిటీహాలును పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని చెప్పారు. మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలోని అన్ని సామాజికవర్గాల ప్రజల సౌకర్యం కొరకు నూతన కమ్యూనిటీహాళ్ల నిర్మాణం చేయడంతో పాటు పాత వాటిలో సమస్యలను పరిష్కరించేందుకు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ ముందుకు సాగుతున్నారని వ్యాఖ్యానించారు.

## గుంటూరు తురుకపాలెంలో ఆరోగ్యశాఖ మంత్రి పర్యటన

గుంటూరు (చైతన్యరథం): గ్రామీణ మండలం తురకపాలెంలో మిస్టరీ మరణాలపై ఇప్పటికీ స్పష్టమైన కారణాలు తెలియలేదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ అన్నారు. శుక్రవారం తురకపాలెంలో పర్యటించి అధికారులు, వైద్యులతో మాట్లాడారు. ప్రాథమికంగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో మెలోడియాసిస్ ఆనవాళ్లు లేవని పేర్కొన్నారు. రక్త నమునాలు సేకరించి చెన్నై ప్రయోగశాలకు పంపినట్లు వెల్లడించారు. ఫలితాలు ఇంకా రాలేదని.. కానీ తప్పకుండా ఏదో వైరస్ ఉందని మాత్రం భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్ బృందం తురకపాలెం వస్తోందన్నారు. వరుస మరణాల విషయంలో జిల్లా వైద్య అధికారులు సరిగా స్పందించలేదని, ఉన్నతాధికారులకు సకాలంలో సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వెలిబుచ్చారు. ఐఏఎస్ అధికారి అధ్వర్యంలో విచారణ కమిటీ వేస్తున్నామని... తప్పని తేలితే డీఎమ్ఎచ్వోపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తురకపాలెంలో త్వరలోనే సాధారణ పరిస్థితులు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రితో పాటు పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## గుంటూరులో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

గుంటూరు (చైతన్యరథం) : విద్యార్థులకు విద్యాభ్యాసం చేసి వారి అభ్యున్నతికి నిస్వార్థంగా కృషి చేసేది ఉపాధ్యాయులేనని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా అన్నారు. గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



## పేద ముస్లింలకు అండగా ఉండాలి : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలోని షా జహూర్ ముసాఫర్ ఖానా కళ్యాణ మండపంకు కొత్త ఏర్పడిన పాలక వర్గం పేద ముస్లిమ్ కుటుంబాలకు అండగా నిలబడాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాక్షించారు. షా జహూర్ ముసాఫర్ ఖానా కళ్యాణ మండపం ప్రెసిడెంట్‌గా నియమితులైన సయ్యద్ సలీమ్‌తో పాటు కమిటీ సభ్యులకి అభినందనలు తెలిపి, రాష్ట్ర ప్రభుత్వం షా జహూర్ ముసాఫర్ ఖానా కళ్యాణ మండపంకు నూతన పాలక వర్గాన్ని నియమిస్తూ జారీ చేసిన నియామక పత్రాన్ని అందజేశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లాహ్ ఆధ్వర్యంలో జహూర్ ముసాఫర్ ఖానా కళ్యాణ మండపం ప్రెసిడెంట్ సయ్యద్ సలీమ్ కమిటీ సభ్యులతో ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ గా ఎన్నికైన సయ్యద్ సలీమ్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ శాలువాతో సత్కరించి పూల మొక్క అందజేశారు. షా జహూర్ ముసాఫర్ ఖానా కళ్యాణ మండపంకు నూతనంగా నియమితులైన ప్రెసిడెంట్ సయ్యద్‌తో పాటు కమిటీ సభ్యులు షా జహూర్ ముసాఫర్ ఖానా కళ్యాణ మండపం అభివృద్ధికి కృషి చేయటంతో పాటు, ఇక్కడ వివాహాలు జరుపుకునే పేద వారికి అన్ని విధాలుగా తోడ్పాడు అందించాలన్నారు. ఈ నూతన పాలకవర్గంలో ప్రెసిడెంట్‌గా సయ్యద్ సలీమ్, వైస్ ప్రెసిడెంట్-1గా షేక్ ఖాజా రహమతుల్లా, వైస్ ప్రెసిడెంట్ 2గా సయ్యద్ ఇమ్రాన్, సెక్రటరీగా షేక్ అమానుల్లా, కోశాధికారిగా సయ్యద్ ఖాదర్ హుస్సెన్, సభ్యులుగా షేక్ ఇస్మాయిల్, షేక్ ఫిరోజ్, షేక్ ఖాదర్ బాషా, షేక్ అబ్దుల్ బరి, సయ్యద్ హుస్సెన్ బాషా, షేక్ ఖలీల్ నియమితులైయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యంలో సంజీవని... అందరికీ ఆరోగ్య బీమా

●దేశానికే ఆదర్శం కానున్న ఏపీ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్: జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకుని వస్తున్న యూనివర్సల్ హెల్త్ పాలసీ పేదల పాలిట సంజీవని కానుందని తెలిపారు చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. డబ్బు లేక చికిత్సలు అందుకోలని పరిస్థితుల్లో ఇకపై ఏ ఒక్కరు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఇకపై ఉండవి, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెడుతున్న క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ దేశానికే ఆదర్శంగా అవుతుందన్నారు. సుమారు 1.63కోట్ల కుటుంబాలు, 5కోట్లమంది ప్రజలకు ప్రయోజనం అందించనున్న అందరికీ ఆరోగ్య బీమా 100శాతం గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. రూ.25 లక్షల వరకు పరిమితి ఉండడం వల్ల ఇకపై ఖరీదైన వైద్య సేవలకు కూడా ఎవరు భయపడాల్సిన పరిస్థితి ఉండదన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. చిన్న జ్వరం నుంచి గుండె ఆపరేషన్లు, డయాలసిస్, కేన్సర్ చికిత్సల వరకు నూతన విధానంలో విస్తృత కవరేజీ అందిస్తారని, ఓ కుటుంబానికి అవసరమయ్యే దాదాపు అన్ని రకాల వైద్యులు ఇకపై ఉచితంగా లభిస్తాయని తెలిపారు. రాష్ట్రం మొత్తం దాదాపు 2,493నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 3,257పైగా వైద్య సేవలు రూపాయి ఖర్చు పెట్టకుండానే అందుతాయన్నారు. ఆస్పత్రుల్లో చేరిన 6 గంటల్లోనే క్యాష్‌లెస్‌కు అనుమతులు ఇవ్వడంతో జాప్యం లేకుండా సేవల అందుబాటులోకి రానున్నాయని అన్నారు. వైద్య ఖర్చుల భారం మోయలేక అప్పులపాలవుతున్న ఎన్నో కుటుంబాలకు ఈ పథకం అతిపెద్ద ఊరటనిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కూటమి తరపున చెప్పి నవే కాక కొత్త పథకాలను కూడా ప్రభుత్వం అందిస్తోందనడా నికి ఇదే నిదర్శనమని చెప్పారు. అధికారంలోకి వచ్చింది మొదలు ఇంత మంచి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురదజల్లడమే జగన్, వైకాపా పనిగా పెట్టుకోవడం దుర్మార్గమని మండి పడ్డారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు. రైతుల ముసుగులో యూరిపై వారు చేస్తున్న ఫేక్ ప్రచారాల్ని ఎవరు నమ్మడం లేదన్న జీవీ అవసరాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, కేంద్రం కూడా సహకరిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం అదనంగా 53వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసిందని... ఆ నిల్వలు రైతులకు చేరేలోపు రాజకీయ లబ్ది కోసం జగన్, వైకాపా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని అన్నారు.

## రోగులకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండ : యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. ఉంగుటూరు మండలం పెద్దవుటపల్లి గ్రామానికి చెందిన పామర్తి శ్రీనివాసరావుకు రూ.2.50 లక్షలు, ఇదే మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన నిమ్మకూరు శ్రీలక్ష్మికి రూ.2.50 లక్షలు, బాపులపాడు మండలం రేమల్లె గ్రామానికి చెందిన చల్లగుళ్ల లక్ష్మీ పెరుమాళ్లకు రూ.2 లక్షలు, గన్నవరం మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన గోడెం సాంబశివరావుకు రూ.2 లక్షలు చొప్పున ఎమ్మెల్యే యార్లగడ్డ సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. గురువారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంజూరైన చెక్కులను రోగుల కుటుంబ సభ్యులకు యార్లగడ్డ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరావు మాట్లాడుతూ... పేద రోగులు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించినందుకు గాను కొత్తగా రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా ప్రవేశపెడుతున్నామని, సత్వరమే ఈ పథకాన్ని అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందని ఈ పథకం అమల్లోకి వస్తే అందరికీ ఉచితంగా వైద్యం లభిస్తుందని యార్లగడ్డ తెలిపారు.

## టెడ్ ఎక్స్ వేదికపై చరిత్ర సృష్టించిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. హైదరాబాదులోని సింబియోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో జరిగిన ప్రతిష్టాత్మక టెడ్ ఎక్స్ కార్యక్రమంలో ప్రసంగించి చరిత్ర సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈ వేదికపై మాట్లాడిన తొలి రాజకీయ నాయకురాలిగా నిలిచారు. "సానుకూల మనస్తత్వం సమాజాన్ని మార్చగలదు. సమస్యలను దాటుకొని ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరి లోపలే శక్తి ఉంది" అని గళ్ళా మాధవి తన ప్రసంగంలో స్పష్టం చేశారు. నేటి యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా, స్ఫూర్తినిచ్చేలా ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రసంగించారు. సమాజంలో మార్పు తీసుకురావడానికి రాజకీయాలు శక్తివంతమైన సాధనం అని, మహిళలు మరింతగా రాజకీయాల్లోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

# విద్యాసంస్కరణలతో ఉత్తమ ఫలితాలు




## ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి మండిపల్లి

రాయచోటి, (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలకు శ్రీకారం చుట్టి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కు బాటలు వేస్తున్నదని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కలెక్టర్ శ్రీధర్, డీఈఓ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా విశ్వగురువులందరికీ అభినందనలు తెలిపారు. దేశం భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషిస్తారన్నారు. విద్యా వ్యవస్థ లో సమూల సంస్కరణలకు చర్యలు చేపట్టామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. తల్లికి వందనం ద్వారా పిల్లల విద్యా భారం ను తల్లి దండ్రులకు తగ్గిస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ నిర్వహణతో పాటు పోస్టుల భర్తీ కీ చర్యలు చేపట్టామన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ లో స్పోర్ట్ కోటా ను పెంచడం క్రీడా శాఖ మంత్రిగా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపుతోందన్నారు. అన్నమయ్య జిల్లా లో 56 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానం చేశామన్నారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ 'స్త్రీ శక్తి' పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలకు అమలు చేస్తున్నామన్నారు.



# డాక్టర్ సర్వేపల్లి సేవలు చిరస్మరణీయం

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నివాళులు

కోవూరు, (చైతన్యరథం): భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నగరంలోని వీపీఆర్ నివాసంలో డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను గుర్తు చేసుకున్నారు. విశిష్ట తత్వవేత్త, విద్యావేత్త, రాజనీతిజ్ఞుడిగా భారతీయ తత్వశాస్త్రాన్ని ప్రపంచానికి చాటిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. ఆయన చేసిన బోధనలు, విద్యారంగంలో ఆయన చేసిన కృషి, వినయంతో కూడిన స్వభావం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కోడూరు కమలాకర్‌రెడ్డి, కోవూరు మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఇంత మల్లారెడ్డి, జొన్నవాడ ఆలయ చైర్మన్ తిరుమూర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శుభాకాంక్షలు

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు ప్రజలకు, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధా కృష్ణన్ గారి జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. ఉపాధ్యాయుడిగా ఉత్తమ సేవలందిస్తూనే దేశ సమగ్రతకు విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన తన జీవితంలో ఎక్కువ భాగం భారతీయ విద్య మరియు భారతీయ తత్వశాస్త్రాన్ని సుసంపన్నం చేయడానికి అంకితం చేశారని చెప్పారు.

# సమాజంలో సాటిలేనిది గురుస్థానం

## కావలి జడ్పీ హైస్కూల్‌కు పూర్వ వైభవం తెస్తాం : ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



కావలి, (చైతన్యరథం): తల్లి జన్మనిస్తే, తండ్రి నడక నేర్పితే, జీవితాన్ని తీర్చిదిద్దేది గురువేనని, ఈ సృష్టిలో గురువు స్థానమే అత్యున్నతమని, గురువుని పూజించడం అనేది ముల్లోకాల పూజతో సమానమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఉపాధ్యాయుల ప్రాధాన్యతను వివరిస్తూ విశేషంగా మాట్లాడారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయుడు ఏ స్థాయికి ఎదగగలడో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం తార్కాణమన్నారు. ఆయన ఉపాధ్యాయ వృత్తి నుంచి ప్రారంభించి ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవులను అలంకరించారన్నారు. అందుకే 1962 నుంచి ఆయన జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగాజరుపుకుంటున్నా మని ఎమ్మెల్యే అన్నారు. తాను కూడా ఉపాధ్యాయ వృత్తితోనే జీవితాన్ని ప్రారంభించానని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. కావలి జె.బి. కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసిన రోజులు మరువలేనివన్నారు. విద్యార్థుల మనసులను గెలుచుకోవడానికి ఉపాధ్యాయుని వాక్చాతుర్యం, ప్రవర్తన, క్రమశిక్షణ, నవ్వు అన్నీ కలగలవాలని, అప్పుడు మాత్రమే ఆయన బోధించిన పాఠాలు విద్యార్థుల హృదయాల్లో నిలిచిపోతాయని అన్నారు. కావలి జడ్పీ హై స్కూల్‌కి దాదాపు 100 సంవత్సరాల చరిత్ర ఉందని, దానిని మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్‌తో చర్చించి, నిధులను సమీకరించే ప్రక్రియలో ఉన్నామని చెప్పారు. గర్ల్స్ హై స్కూల్, బాయ్స్ హై స్కూల్‌లో చెరో 1200 మంది విద్యార్థులు చదువుకునే విధంగా తరగతి గదులు, ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే దాతల సహకారంతో నిధుల సమీకరణకు చర్యలు ప్రారంభించామని వివరించారు. ఉపాధ్యాయులు లక్షలాది మంది జీవితాలను తీర్చిదిద్దగలరని, చెడిపోయే వ్యక్తిని సక్రమ మార్గంలో నడిపించేది గురువేనని, అందుకే ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యున్నతమైనదని అన్నారు. ప్రతి సంవత్సరం నియోజకవర్గ స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని ఉపాధ్యాయుల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచిస్తూ, వాటికి అయ్యే ఖర్చు మొత్తాన్ని తానే భరించేందుకు సిద్ధమని ఎమ్మెల్యే ప్రకటించారు. గురుదక్షిణగా ఇది నా కర్తవ్యమని భావిస్తున్నాని, మీ అందరితో కలిసి విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా కాదు, గురువుగా మీ వెనక నడవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని అన్నారు.. ఉత్తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బంది గోవిందయ్య, వెంకట సుబ్బయ్య, కావలి ఏఎంసి చైర్మన్ పోతుగంటి అలేఖ్య, ఎంపీడీవో శ్రీదేవి, టిటిపి కావలి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ బాబు ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, పొట్లూరు శ్రీనివాసులు, కండ్లకుంట మధుబాబు నాయుడు, నాయుడు రాంప్రసాద్, టీచర్స్ యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్తమ టీచర్‌కు డాక్టర్ గొట్టిపాటి సత్కారం

దర్శి, (చైతన్యరథం): దర్శి మండలం, రాజంపల్లి ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలుగా ఎంపికైన బోడపాటి అనసూయకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా దర్శి టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ శాలువాతో సత్కరించి, అభినందించారు. విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. విద్యార్థులు, ప్రజల దృష్టిలో ఆదర్శ ఉపాధ్యాయురాలుగా బోడపాటి అనసూయ నిలిచారని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ శాసనసభ్యుడు నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మండల పార్టీ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, కూటమి నాయకులు పాల్గొన్నారు.




# అనారోగ్య బాధితురాలికి టీడీపీ అండ

నెల్లూరు, (చైతన్యరథం): టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు ఆదేశాల మేరకు 47 డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ టీంతో కలిసి పీ4 కార్యక్రమంలో భాగంగా వెన్నెముక వ్యాధితో బాధపడుతున్న మల్లెంబాకం ఉమాఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారావు మాట్లాడుతూ తండ్రి మరణంతో నిరాశలో కూరుకుపోయిన మల్లెంబాకం ఉమా జీవితంలో 'పీ4' పథకం వెలుగులు నింపాలని మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ను కోరుతున్నామన్నారు. 50 సంవత్సరాల మల్లెంబకం ఉమా, ఎంఏ లిటరేచర్ పీజీ పూర్తి చేసిన విద్యావంతురాలని వివరించారు. ఉన్నంత చదువులు చదివి 2012 సంవత్సరం దాకా ఎంతో ఉత్సాహంగా ఉద్యోగంలో విధులు నిర్వహించారన్నారు. డాక్టర్ గణేష్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కూడా చేసుకున్నారు , కుటుంబానికి టీడీపీ బాధితుల జీవితంలో వెలుగు నింపుతారని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలవకుంట భాస్కర్, బూత్ ఇంచార్జీలు కంచి కృష్ణ, భవాని అశోక్, మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శ్రేష్ఠజీవి బాధ్యతపై దిశానిర్దేశం చేసిన మహమ్మద్ ప్రవక్త



## శాంతి ర్యాలీ నిర్వహించిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్

నెల్లూరు, (చైతన్యరథం): అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించి 1500 సంవత్సరాలు గడిచిన సందర్భంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని శాంతి ర్యాలీ నిర్వహించామని తెలిపారు. అంతిమ దైవ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని యావత్ ప్రపంచ మానవాళి పండుగ చేసుకుంటుందని తెలిపారు. దైవ ప్రవక్త ఒక కులం కోసమో, మతం కోసమో కాదు యావత్ ప్రపంచ మానవాళి కోసం వచ్చారని అన్నారు. సమాజంలో ఇతరులతో సోదర, స్నేహ భావంతో ఎలా మెలగాలి, అందరినీ సమానత్వంతో ఎలా చూడాలి, పేదరిక నిర్మూలన లో మన బాధ్యత ఏంటి, శ్రేష్ఠజీవి బాధ్యత పై ప్రపంచ మానవాళి కి నిర్దేశం చేశారని అన్నారు. అంతిమ దైవ ప్రవక్త జన్మదిన కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టం అని తెలిపారు.

# త్వరలో శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలు

## సీఎం చంద్రబాబు సభకు తరలిరండి : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పిలుపు

గోరంట్ల, (చైతన్యరథం): త్వరలోనే శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గోరంట్ల మండల కేంద్రంలో శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహ నిర్మాణానికి మంత్రి సవిత శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, భారతదేశాన్ని పాలించిన వారిలో శ్రీకృష్ణదేవరాయులు గొప్ప చక్రవర్తన్నారు. తన పాలనలో రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దారన్నారు. చెరువులు, కాలువులు ఏర్పాటు చేశారన్నారు. దేవాలయాలను నిర్మించి మత సామరస్యానికి కృషి చేశారన్నారు. ప్రస్తుత పెనుకొండనే తన రెండో రాజధానిగా చేసుకుని, విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయులు పాలించారన్నారు. తన తండ్రి పేరున శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

**రాయల స్ఫూర్తితో చంద్రన్న పాలన**

విజయనగర సామ్రాజ్య పాలకుడిగా శ్రీకృష్ణదేవరాయలు ప్రజాక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారని మంత్రి సవిత తెలిపారు. మారు వేషంలో పర్యటిస్తూ, ప్రజల కష్టాలను తెలుసుకునేవారన్నారు. ఆయన స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చాలన్న సంకల్పంతో సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు గ్రామాల్లో పర్యటిస్తున్నారన్నారు.

**శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలు**

శ్రీకృష్ణదేవరాయులు ఉత్సవాల నిర్వహణపై ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడితో చర్చించినట్లు మంత్రి సవిత వెల్లడించారు. పెనుకొండలో ఉన్న కొండపై నర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంతో పాటు శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. లేపాక్షి ఉత్సవాలు కూడా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. త్వరలోనే ఈ ఉత్సవాలపై ఒక ప్రకటన చేస్తామన్నారు.





గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, గోరంట్లలో కాపు భవనం నిర్మాణానికి 50 సెంట్లు కేటాయించామని, త్వరలోనే భవన నిర్మాణ పనులు కూడా ప్రారంభిస్తామని మంత్రి సవిత వెల్లడించారు.

**చంద్రబాబు సభకు తరలిరండి**

ఈ నెల పదో తేదీన అనంతపురంలో నిర్వహించే సూపర్ సిక్స్, సూపర్ హిట్ విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ విజయోత్సవం సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గోరంట్ల మండలానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, గోరంట్ల మండల కేంద్రవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వలస బాటలో వైసీపీ నేతలు

## టీడీపీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజు, తిప్పేస్వామి

మడకశిర, (చైతన్యరథం): నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంచలంచలుగా కుప్పకూలుతోంది. తాజాగా మడకశిర నియోజకవర్గం, అమరాపురం మండలం, ఆగళి మండలాలకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలోకి వచ్చామని వారు తెలిపారు. టీడీపీలోకి వచ్చిన వైసీపీ నేతలకు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెస్ రాజు, తిప్పేస్వామి ఆహ్వానించారు. గత ఐదేళ్ల పాలనలో మడకశిర నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమానికి దూరమైందని కూటమిపాలనలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పార్టీలో చేరిన వారికి ఎమ్మెస్ రాజు తెలియజేశారు. కూటమిపాలనలో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన పరిపాలనను... సంక్షేమ పథకాలను అందించేందుకు, ప్రజా ప్రభుత్వాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అనేక అవమానాలు, నిర్లక్ష్యానికి గురైన తాము నేడు నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడతామని టీడీపీలో చేరిన వైసీపీ నేతలు తెలియజేశారు.




# సీఎం చంద్రబాబు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

## పరిశీలించిన ఎంపీ బీకే, మంత్రి కొల్లు, ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం, (చైతన్యరథం): అనంతపురం పట్టణంలో ఈనెల 10వ తేదీన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ ప్రోగ్రాం కోసం ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణాన్ని, ఏర్పాట్లను టీడీపీ ప్రముఖులు పరిశీలించారు. ఇందులో హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి, మంత్రి కొల్లు రవీంద్ర, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, అహుడ చైర్మన్ టీసీ వరుణ్, ఏడీసీసీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, పూల నాగరాజు, ఇతర నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



# ఘనంగా ప్రవక్త జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సవిత

పెనుకొండ, (చైతన్యరథం): నీతి, నిజాయితీ, ప్రేమ, త్యాగం లాంటి అంశాలను పాటిస్తూ జీవితం కొనసాగించిన మహమ్మద్ ప్రవక్త ప్రతి ముస్లిం కు ఆదర్శం కావాలని తెలిపారు. పెనుకొండలోని మిలాద్ -ఉన్-నబి సందర్భంగా స్థానిక దర్గాలో దువా నిర్వహించారు. అనంతరం విచ్చేసిన ముస్లిందరికీ రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియ చేశారు.



# సీఎం చంద్రబాబు సభకు భారీగా తరలి రండి

మడకశిర, (చైతన్యరథం): అనంతపురంలో ఈనెల 10 తేదీన జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం రెండు సమాంతరంగా నడిపిస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అనంతపురం సభకు కూటమి నాయకులు చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, బీజేపీ నాయకులు మాధవ్ విచ్చేయుచున్న తరుణంలో అంతా కలిసి బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల ముందర ఇచ్చిన సూపర్ సిక్స్ మెగా డీఎస్సీ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ, ఉచిత బస్సు ప్రయాణం, 4 వేల పెన్షన్, అన్న క్యాంటీన్ వంటిఅనేక కార్యక్రమాలు అమలు చేయడం జరిగింది. మడకశిర కు మరొక భారీ పరిశ్రమ 1200 కోట్లతో పెట్టాలని క్యాబినెట్లో తీర్మానం చేశారన్నారు. ఈ కార్యక్రమం పరిశీలకులుగా వచ్చిన కడప డిసిసి చైర్మన్ జై ప్రకాష్ , రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి ఒకలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ రాజు మార్కెట్ యార్డ్ చైర్మన్, గురుమూర్తి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, జడ్పిటిసి సభ్యులు,అన్ని మండల కన్వీనర్లు, సింగిల్ విండో అధ్యక్షులు కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్చార్జులు, అన్ని అనుబంధ కమిటీ నాయకులు పాల్గొన్నారు.




# వచ్చే ఎన్నికల్లో వైసీపీ కనుమరుగు


## టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ వెల్లడి

అమరావతి, (చైతన్యరథం): రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన, కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పాలనపై అసెంబ్లీ వేదిక చర్చకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సవాలు విసిరితే, సజ్జల రామకృష్ణారెడ్డి పిచ్చిపిచ్చిగా మాట్లాడటం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. అమరావతిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సజ్జల రామకృష్ణా రెడ్డి ఇంకా తాను సకల శాఖా మంత్రి అనే భ్రమలోనే ఉన్నాడని, వైసీపీ ప్రభుత్వంలో సకల శాఖా మంత్రిగా వెలగబెట్టి ఆయన చేసిన ఘనకార్యాలు అందరికీ తెలుసునన్నారు. వైసీపీలో సైతం యాక్సెప్టెన్స్ లేని వ్యక్తి వచ్చి తమ కూటమి ప్రభుత్వాన్ని ఎలా ప్రశ్నిస్తాడని విమర్శించారు. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో డిపాజిట్లు గల్లంతయి ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో ఘోర పరాజయం చెందిన వైసీపీ నేతలకు మతిభ్రమించి పిచ్చివాగుడు వాగుతున్నారని ఆయన విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా వైసిపికి రాదని ఆయన జోశ్యం చెప్పారు. సజ్జల నాయకత్వం గురించి వైసీపీలో ఏమనుకుంటున్నారో? ఆయన తెలుసుకోవాలని ఆయన అన్నారు. శకుని ఎలా అయితే కురు వంశాన్ని నిర్వీర్యం చేశాడో సజ్జల అలాగే వైసీపీని తన సారథ్యంలో నిర్వీర్యం చేస్తాడన్నారు. ఈ మాట మేం అనడం లేదని వైసీపీలో ఏ జిల్లా, మండల స్థాయినేతను అడిగినా ఇదే చెపుతారని ఆయన తెలిపారు. సజ్జల ముందు తన బొక్కలు పూడ్చుకుని, కార్పొరేటర్ గా నెగ్గి వచ్చి తరువాత తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పాతర్ల రమేష్ హెచ్చరించారు.



# సైనిక దళాలకు ఆధునిక ఆయుధాలు

**యుద్ధ రంగంలో సూపర్ సోనిక్ విమానాలు - ఆధునిక ప్రణాళికను ఆవిష్కరించిన మోదీ**



పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలను అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికను మోదీ ప్రభుత్వం ఆవిష్కరించింది. దాదాపు 15 ఏళ్ల వ్యవధిలో ఈ లక్ష్యాలను పూర్తి చేసేలా రోడ్ మ్యాప్ సిద్ధం చేసింది. ఇందుకోసం భారీ మొత్తంలో వెచ్చించేందుకు సిద్ధమైంది. కనీసం 500కు తగ్గకుండా హైపర్ సోనిక్ క్షిపణులను దళాలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విజన్ డాక్యుమెంట్ ప్రకారం పాత టీ-72 (172) యుద్ధట్యాంక్‌ను 1800 అత్యాధునిక ఫ్యూచర్ ట్యాంక్‌లతో భర్తీ చేయనున్నారు. మరో 400 తేలికపాటి ట్యాంక్లను దళాలకు అందించనున్నారు. ట్యాంకుల నుంచి ప్రయోగించే 50,000 యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్స్, 6,00,000 శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలను సమకూర్చుకోనుంది. వీటితోపాటు 700 రోబోటిక్ కౌంటర్ ఐఈడీ సిస్టవమ్‌లను రంగంలోని దించాలని నిర్ణయించింది. ఇక నౌకాదళం కోసం సరికొత్త ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్, 10 అత్యాధునిక ఫ్రిగెట్లు, 7 అడ్వాన్స్‌డ్ కార్వెట్టీలు, 4 ల్యాండ్ డాక్ ప్లాట్ఫారమ్స్, హెలికాప్టర్లకు ప్లాన్ చేస్తోంది. వీటితో పాటు అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, ఎలక్ట్రోమాగ్నెట్ ఎయిర్ క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వాయుసేన కోసం 75 హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్స్, 150 స్టెల్త్ బాంబర్ డ్రోన్లు, 100 రిమోట్ సాయంతో పనిచేసే విమానాలు, గైడెడ్ ఆయుధాలు, 20 స్ట్రాటోస్పియరిక్ ఎయిర్ షిప్‌లను సమకూర్చనుంది. 21 శతాబ్దంలో ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యాన్ని తీర్చి దిద్దాలని లక్ష్యంగా పెట్టుకొంది. ఇవి కాకుండా యాంటీ స్వార్మ్ డ్రోన్ వ్యవస్థలు, లేజర్ ఆయుధాలు, మానవ రహిత విమానాల కోసం ఎయిర్ టూ సర్ఫేస్ మిసైల్స్, అత్యాధునిక టార్గెటింగ్ పాడ్స్ వంటివి కూడా ఉన్నాయి. ఆయుధాలను మరింత అభివృద్ధి చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీని వాడతామని రక్షణశాఖ పేర్కొంది. రోబోటిక్స్, కృత్రిమ మేధ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యుద్ధ భూములను మార్చేస్తున్నాయని అభిప్రాయపడింది. భారతీయ కంపెనీలు మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలని రక్షణశాఖ కోరింది.

# మెర్సిడెస్ బెంజ్‌కు హవాయి చెప్పులకు ఒకే రకం పన్ను విధించగలమా

**జీఎస్టీపై చర్చలో విపక్షాలకు కేంద్ర ఆర్థికమంత్రి ప్రశ్న**

మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమైనదని, ఇలాంటి సమయంలో ఒకే పన్ను విధానాన్ని తీసుకురావడం అసాధ్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్వరూపంలో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణలపై ఆమె మాట్లాడారు. సామాన్యులపై పన్ను భారం తగ్గించేందుకే జీఎస్టీ విధానంలో ఈ సవరణలు చేసినట్లు తెలిపారు. జాతీయ మీడియా సంస్థ ఇండియాటుడే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మలమ్మ ఈ వ్యాఖ్యలు చేశారు."వన్ నేషన్- వన్ ట్యాక్స్ మంచి ఆలోచనే కానీ.. ఆచరణలో అది సాధ్యం కాదు. అభివృద్ధిలో వైవిధ్యాలు ఉన్నప్పుడు ఏకరూప జీఎస్టీ రేటును అమలు చేయడం అన్యాయమవుతుంది. మెర్సిడెస్ బెంజ్ కారు, హవాయి చెప్పులకు ఒకే పన్ను రేటు విధించగలమా? ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితంగా ఉంది. అభివృద్ధి చెందిన రంగాలు అధిక పన్నులను కట్టగలుగుతాయి.



అభివృద్ధి చెందని రంగాలకు అది భారమవుతుంది. ఒకవేళ భారత్ అన్ని రంగాల్లో సంపూర్ణంగా అభివృద్ధి చెందితే అప్పుడు ఒకే పన్ను విధానం సాధ్యమవుతుంది" అని నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

గబ్బర్ సింగ్ ట్యాక్స్ అన్నవారే. ఈ సందర్భంగా విపక్ష కాంగ్రెస్ పార్టీపై ఆర్థిక మంత్రి విమర్శలు గుప్పించారు. "ఒకప్పుడు జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అంటూ ఎగతాళి చేసిన వారే.. ఇప్పుడు పన్ను సంస్కరణలు చేయగానే క్రెడిట్ తీసుకునేందుకు ఆరాటపడుతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 91శాతం వరకు ఆదాయపు పన్ను విధించిన రోజులు ఉన్నాయి" అని దుయ్యబట్టారు. జీఎస్టీలో సంస్కరణ వల్ల రాష్ట్రాలతో పాటు కేంద్రానికి కూడా ఆదాయంలో కొంత కోత ఉంటుందని నిర్మలమ్మ తెలిపారు. తమ ప్రభుత్వానికి పౌరుల అవసరాలే ప్రథమ ప్రాధాన్యమని, ఆ తర్వాతే ఆదాయం గురించి ఆలోచిస్తామని పేర్కొన్నారు. టారిఫ్‌ల వల్ల ఎగుమతిదారులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారంపైనా కేంద్రం దృష్టిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని మరోసారి స్పష్టం చేశారు.

# అనవసర వ్యాఖ్యలతో తప్పు దోవ పట్టించొద్దు

***ట్రంప్ సలహాదారుడికి భారత విదేశాంగ ప్రతినిధి కౌంటర్***

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఇటీవల భారత్పై నోరుపారేసుకున్న విషయం తెలిసిందే. కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా భారత్ స్పందించింది. వీటిని తీవ్రంగా ఖండించింది. నవారో వ్యాఖ్యలపై దేశ విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు. అవి సరైనవి కావని.. తప్పుదారి పట్టించేవని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత్, అమెరికాల మధ్య సంబంధాలు ఎంతో కీలకమని ఈ సందర్భంగా జైస్వాల్ పేర్కొన్నారు. "ఈ రెండు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయి. మన ఉమ్మడి ప్రయోజనాలు, ప్రజాస్వామ్య విలువలు ఇందులో ఉన్నాయి" అని వెల్లడించారు. పరస్పర గౌరవం, ఉమ్మడి ప్రయోజనాల ఆధారంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు ముందుకు సాగుతాయని తాను అశిస్తున్నట్లు పేర్కొన్నారు. అలస్కాలో జరుగుతున్న సంయుక్త సైనిక విన్యాసాలు ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఇరు దేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని.. అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు భారత్ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. "రష్యాకు భారత్ లాండ్రోమ్యాట్లా పనిచేస్తోంది. మీకు తెలుసా.. ఓ వర్గం లబ్ధి పొందేందుకు భారత ప్రజలను పణంగా పెడుతోంది. మనం దానిని అడ్డుకోవాలి. అది ఉక్రెయిన్ వాసులను చంపుతోంది. మనం (అమెరికన్లు) చెల్లింపుదారులుగా ఏం చేయాలో అది చేయాలి" అని ఇటీవల నవారో వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో మాస్కో, బీజింగ్ భారత్ సంబంధాలు ప్రపంచ స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయంటూ నవారో ఆందోళన వ్యక్తంచేశారు. "అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి అధినేత అయిన మోదీ ఓ గొప్ప నాయకుడు. కానీ, పుతిన్, జింగ్‌పింగ్‌తో ఎందుకు అంటకాగుతున్నారో నాకు అర్థం కావడంలేదు" అని వ్యాఖ్యానించారు.

# అలా మాట్లాడింది నిజమే.. కానీ ఉద్దేశ్యమది కాదు

**మహిళా ఐపీఎస్‌తో మహా డిప్యూటీ సీఎం లడాయి**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ మధ్య జరిగిన వాగ్వాదం నెట్టింట వైరల్గా మారిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా అజిత్ పవార్ స్పందించారు. చట్టపరమైన విషయాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం తనకు లేదని తెలిపారు. కేవలం అక్కడి పరిస్థితిని చక్కదిద్దేందుకే ఆమెకు ఫోన్ చేసినట్లు తెలిపారు. అసలేం జరిగిందంటే. ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టిన ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణతో అజిత్ పవార్ ఫోన్లో మాట్లాడారు. ఆ చర్యలను వెంటనే ఆపాలని ఆమెను ఆదేశించారు.

'నీకు ఎంత దైర్యం? ఉపముఖ్యమంత్రి ఫోన్ చేస్తే నమ్మవా? నన్నే వీడియో కాల్ చేయమంటావా?" అని ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో ఆయనపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ వివాదంపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "సోలాపూర్ పోలీసు అధికారులతో నా సంభాషణకు సంబంధించిన వీడియో వైరల్ అవడం నా దృష్టికి వచ్చింది. చట్టపరమైన విషయాల్లో జోక్యం చేసుకోవడం నా ఉద్దేశం కాదు. కేవలం అక్కడ పరిస్థితి మరింత తీవ్రంగా మారకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఫోన్లో మాట్లాడా. పోలీసు విభాగం, ముఖ్యంగా మహిళా అధికారులంటే నాకు చాలా గౌరవం ఉంది. చట్టానికి కట్టుబడి ఉంటా. ఇసుక, మైనింగ్ అక్రమ కార్యకలాపాలకు నేను ఎప్పటికీ వ్యతిరేకమే" అని పేర్కొన్నారు.

# గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**12 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు**

గణేశ్ నిమజ్జనానికి ముంబయి పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకను సజావుగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు ముంబయి నగర వ్యాప్తంగా 21వేల మంది పోలీసులను మోహరించనున్నారు. దీంతో పాటు అదనంగా డ్రోన్లు, ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నారు. శనివారం నిమజ్జన కార్యక్రమం నేపథ్యంలో మొత్తంగా 12మంది అదనపు పోలీస్ కమిషనర్లు, 40మంది డీసీపీలు, 61మంది ఏసీపీలతో పాటు 3వేల మంది ఆఫీసర్లు, 18వేల మంది పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. మరోవైపు, ట్రాఫిక్ సంబంధిత అప్డేట్స్, రూట్, రియల్టైమ్ ట్రాఫిక్ మేనేజ్మెంట్‌ను పర్యవేక్షించేందుకు ఈ ఏడాది తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అలాగే ముంబయి మహానగరంలోని పలు బీచ్‌లు ఇతర నీటివనరులతో పాటు బృహాన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కృత్రిమ నిమజ్జన ప్రదేశాల్లో దాదాపు 1.8 లక్షలకు పైగా గణేశ్ విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బీఎంసీతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో లైఫ్ గార్డ్స్ కూడా ఉంటారని పేర్కొన్నారు. రియల్ టైం ట్రాఫిక్ మేనేజ్మెంట్ వంటివి తెలుసుకొనేందుకు అదనంగా 10వేల సీసీటీవీ కెమెరాలతో నగరంలో నిమజ్జన ప్రదేశాలపై నిఘా ఉంచనున్నట్లు పోలీసులు తెలిపారు. పలు కీలక ప్రదేశాల్లో డ్రోన్ నిఘాతో ప్రజల కదలికలను పర్యవేక్షించనున్నారు. ఈ సమయంలో భద్రతాపరమైన కారణాలను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ డ్రోన్ల వాడకాన్ని నిషేధించారు.

# ఆందోళన కలిగిస్తున్న ఆకస్మిక మరణాలు

**వయసుతో నిమిత్తం లేని గుండెపోటు**



వయసుతో సంబంధం లేకుండా హఠాత్తుగా సంభవిస్తున్న గుండె పోటు మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మహారాష్ట్రలోని కొల్హా పూర్లో 10 ఏళ్ల బాలుడు గుండెపోటుతో మరణించిన ఘటన ఆల స్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. కొల్హాపూర్లోని కోడోలి గ్రామానికి చెందిన బాలుడు శ్రావణ్ (10) బుధవారం వినాయకుడి మండపం వద్ద ఆడుకుంటుండగా అస్వ స్థతకు గురయ్యాడు. అసౌకర్యంగా అనిపించడంతో ఇంటికి వెళ్లి.. తల్లి ఒడిలో పడుకున్నాడు. నిద్రలోకి జారుకున్న కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. ఎంతసేపటికీ లేకపోవడంతో వెంటనే ఆస్ప త్రికి తరలించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీ కరించారు. కళ్ల ముందే కొడుకు ప్రాణాలు కోల్పోవడంతో ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. శ్రావణ్‌కు ఎటుంటి అనారోగ్య సమ స్యలు లేవని ఎప్పుడూ చలాకీగా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలి పారు. గుండెపోటుతో తమిళనాడుకు చెందిన కార్డియాక్ సర్జన్‌తో మరణించడం నమ్మశక్యంగా లేదని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

# శెభాష్ దుబాయ్ పోలీస్

**కాణీ ఖర్చు లేకుండా పోగొట్టుకున్న ఫోన్ తిరిగొచ్చింది**




వనితా విత్తం పొత్తం పరాధీనం గతం గతహ .... పోగొట్టుకున్న వస్తువులు తిరిగి వారి చెంతకు చేరాలంటే రాసిపెట్టి ఉండాలి. ఎదురైంది. మదన్ గత వారం దుబాయ్ ఎయిర్ పోర్టులో తన ఫోన్ పోగొట్టుకున్నారు. అక్కడ ఉన్న సిబ్బందిని సంప్రదించగా.. ఫోన్కు సంబంధించిన వివరాలను ఈ-మెయిల్ చేయమని చెప్పారు. కేవలం ఫోన్ వివరాలను ఈ-మెయిల్ చేసిన మదన్ దుబాయ్ నుంచి చెన్నై) కి తిరిగి వచ్చిన తర్వాత తాను పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించినట్లు ఈ-మెయిల్ వచ్చింది. మదన్ ఫోన్‌ను గుర్తించిన దుబాయ్ పోలీసులు వెంటనే మరొక విమానంలో ఆ ఫోన్‌ను చెన్నైకి ఎలాంటి రవాణా ఛార్జ్ లేకుండా ఉచితంగా పంపించడానికి ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించిన వీడియోను మంగళవారం ఇన్స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. ఆ వీడియోకి ఇప్పటి వరకు 2.6 మిలియన్ వ్యూస్ దక్కాయి. దాదాపు 2 లక్షల మందికి పైగా లైక్ కొట్టారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. దుబాయ్ పోలీసుల పనితీరును అభినందించారు. ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన ప్రదేశంగా దుబాయ్‌ను కొనియాడుతున్నారు.

# ఉక్రెయిన్‌కు సహకరించే దేశాలనూ వదలం

### రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజా హెచ్చరిక - పారిస్‌లో ఐరోపా దేశాధినేతల భేటీపై ఆగ్రహం

ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో తమ దళాలను మోహరించే ఏ దేశాలనైనా తమ సైన్యం లక్ష్యంగా చేసుకుంటుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. 26 ఐరోపా దేశాల నేతలు గురువారం పారిస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన నేపథ్యంలో పుతిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న సమయంలో తమకు వ్యతిరేకంగా నిలిచే దేశాలను చట్టబద్ధమైన లక్ష్యాలుగా చేసుకునే అధికారం తమకు ఉంటుందని ఈ సందర్భంగా పుతిన్ స్పష్టం చేశారు. ఇటువంటి బలగాల మోహరింపు దీర్ఘకాలిక శాంతికి అనుకూలం కాదని అభిప్రాయపడ్డారు. పశ్చిమ దేశాలతో ఉక్రెయిన్‌కు ఉన్న సన్నిహిత సైనిక సంబంధాలు ఇరుదేశాల మధ్య సంఘర్షణకు మూలకారణాలుగా పుతిన్ వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య శాంతిచర్చలు ఫలించి యుద్ధం



ఆగిపోతే, ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో ఇతర దళాలను మోహరించాల్సిన అవసరం ఏముంటుందని పుతిన్ ప్రశ్నించారు. దీర్ఘకాలిక శాంతికి దారితీసే నిర్ణయాలు తీసుకుంటే.. అసలు ఉక్రెయిన్‌లో ఇతర దళాలు మోహరించాల్సిన అవసరమే ఉండదన్నారు. తాము చేసుకున్న ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉంటుందని తెలిపారు.

గురువారం పారిస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన ఐరోపా నేతలు కీవ్‌కు కావాల్సిన భద్రతా హామీల గురించి చర్చించారు. అమెరికా తరపున ఈ భేటీలో ఆ దేశ ప్రత్యేక రాయబారి విట్కాఫ్ పాల్గొన్నారు. సమావేశానికి ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ నేతృత్వం వహించారు.

ఈ సందర్భంగా మెక్రాన్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్ భద్రతకు ఐరోపా హామీగా ఉంటుందని పేర్కొన్నారు. శాంతిచర్చలు ఫలించి యుద్ధం ఆగిపోతే, ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో తమ దళాలను మోహరించడానికి 26 ఐరోపా దేశాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఉక్రెయిన్‌కు సుదీర్ఘ శ్రేణి క్షిపణులను సరఫరా చేయాలని ఐరోపా కూటమి నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

# భారత్‌కు దూరమయ్యాం!

**డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**



భారత్– అమెరికా సంబంధాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు దిగజారాయనే అర్ధంలో మాట్లాడిన ఆయన.. తాము భారత్, రష్యాలకు దూరమైనట్టేనని వ్యాఖ్యానించారు. షాంఘై సహ కార సంస్థ సదస్సులో మోడీ, పుతిన్, జిన్పింగులు కలిసివున్న ఫొటోను షేర్ చేసిన ట్రంప్.. ఆ మూడు దేశాలకు ఉజ్వల భవిష్యత్తు కలిగి ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. "భారత్, రష్యాలను చైనాకు కోల్పోయినట్టు కనిపిస్తోంది. ఆ మూడు దేశాలకు ఉజ్వల, సుసంపన్నమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నా" అని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో వ్యంగ్యంగా పోస్టు పెట్టారు. ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలపై ట్రంప్ విరుచుకుపడుతున్న వేళ.. తియాన్జజిన్ వేదికగా జరిగిన ఎస్సీవో సదస్సులో రష్యా, చైనా, భారత్ అధినేతలు ఒకే వేదికపై కనిపించారు. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లపై చర్చించిన వీరు.. తామంతా ఏకతాటిపై ఉన్నామన్న సంకేతాలిచ్చారు. వీరి సమావేశంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. ట్రంప్ తీరువల్లే ఆ మూడు దేశాలు ఒక్కటయ్యాయనే వాదన కూడా అమెరికాలో వినిపించింది. ఈ నేపథ్యంలో మిత్ర దేశంగా ఉన్న భారత్ దూరమైనట్టు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**అమెరికాలో ఇక 'యుద్ధమంత్రిత్వ శాఖ'**

అమెరికా డిపార్ట్‌మెంట్ ఫ్ డిఫెన్స్‌ను 'డిపార్ట్మెంట్ ఆఫ్ వార్'గా మారుస్తూ అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌పై సంతకం చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఈ పేరుతో గతంలోనే మంత్రిత్వ శాఖ ఉండగా.. 1947 క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 'డిపార్ట్మెంట్ ఆఫ్ వార్' పేరును అగ్రరాజ్యం తొలగించింది. మళ్లీ దానిని పునరుద్ధరిస్తూ.. పెంటగాన్ పేరు మార్చేందుకు అమెరికా అధ్యక్షుడు సిద్ధమయ్యారు. "పీట్ హెగ్సెత్ తరచూ అమెరికా రక్షణశాఖ అంటూ సంబోధిస్తుంటారు. అది నాకు నచ్చలేదు. రక్షణ అనే పదమెందుకు? గతంలో పిలిచినట్టుగానే ఇకపై 'డిపార్ట్మెంట్ ఆఫ్ వార్' అని పిలుద్దాం. అది ఎంతో శక్తిమంతమైన పదం. అదే శక్తితో గతంలో అమెరికా మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలలో విజయం సాధించింది. ప్రతి విషయంలోనూ ముందంజలో నిలిచింది. ఇప్పుడు కూడా అదే పేరుతో మరింత ముందుకు వెళ్లాం" అని ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలో మాట్లాడారు. దీనికి ట్రంప్ పాలకవర్గ సభ్యులూ మద్దతునిచ్చారు. ప్రస్తుతం అమెరికా రక్షణ శాఖ మంత్రిగా పీట్ హెగ్సెత్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ఎవరెవరు.. ఎంతెంత!?

### పెట్టుబడులపై టెక్ దిగ్గజాలకు ట్రంప్ పశ్న - టెకీలకు విందు ఇచ్చి మరీ అడిగిన వైనం..

అమెరికాలోని ప్రముఖ టెక్నాలజీ సంస్థల అధిపతులు, సీఈవోలకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విందు ఇచ్చారు. వైట్ హౌస్‌లో ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ ఆధ్వర్యంలో జరిగిన ఏఐ ఈవెంట్ అనంతరం డిన్నర్ ఏర్పాటు చేశారు. దీనికి టిమ్‌కుక్, సుందర్ పిచాయ్, జుకర్‌బర్గ్, సత్యనాదెళ్లవంటి పలువురు టెక్ దిగ్గజాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమెరికాలో పెట్టుబడుల గురించి ట్రంప్ వారిని సూటిగా ప్రశ్నించారు."టిమ్.. అమెరికాలో యాపిల్ ఎంత పెట్టుబడులు పెట్టనుంది. అది చాలా పెద్ద మొత్తమే అయి ఉంటుందని నాకు తెలుసు. ఇన్నాళ్లూ మీరు బయట (ఇతర దేశాల్లో) పెట్టుబడులు పెట్టింది చాలు. ఇక స్వదేశానికి తిరిగిరండి. ఎంత పెట్టుబడి పెడతారు?" అని యాపిల్ సీఈవో టిమ్ కుక్‌ను ట్రంప్ అడిగారు. దీనికి టిమ్ బదులిస్తూ.. '600 బిలియన్ డాలర్లు' అని చెప్పారు. ఆ వెంటనే మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్‌ను ట్రంప్ అడగ్గా.. '600 బిలియన్ డాలర్లు' అని చెప్పారు. 'రాబోయే రెండేళ్లలో 250 బిలియన్ డాలర్లు అమెరికాలో పెట్టుబడులు పెట్టబోతున్నాం' అని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తెలిపారు. 'ఏటా 80 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తాం' అని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల బదులిచ్చారు. దీంతో ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. "ఇది చాలా పెద్ద మొత్తం. అనేక



ఉద్యోగాలు సృష్టించొచ్చు. ధన్యవాదాలు" అని టెక్ దిగ్గజాలను మెచ్చుకున్నారు.

**ప్రత్యర్థిని పిలిచి మస్క్‌కు షాక్**

విందుకు టెస్లా అధినేత, అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌కు ఆహ్వానం అందకపోవడం చర్చకు తావిచ్చింది. అధ్యక్ష ఎన్నికలు ముగిసిన తర్వాత కొంతకాలంపాటు ట్రంప్‌వెంటే మస్క్ కన్పించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో ఆయన డోజ్ శాఖ బాధ్యతలనూ నిర్వహించారు. తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో బహిరంగంగానే విమర్శలు చేసుకున్నారు. ఈ క్రమంలోనే తాజాగా టెస్లా అధినేతను అధ్యక్షుడు ఆహ్వానించకపోవడం గమనార్హం. కాగా.. మస్క్ స్థానంలో ఆయన ప్రత్యర్థి, ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌కు ఆతిథ్యమివ్వడం చర్చనీయాంశమైంది. విందులో జుకర్బర్గ్ –ట్రంప్ మధ్య సరదా సంభాషణ జరిగింది. ఈ డిన్నర్‌కు వస్తుండగా ఓ విలేకరి మెటా అధినేతతో మాట్లాడారు. బ్రిటన్‌లో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించి మీరు ఆందోళన చెందుతున్నారా? అని అడిగారు. దీనికి సమాధానం చెప్పేందుకు జుకర్‌బర్గ్ నిరాకరించారు. ఈ విషయం తెలుసుకున్న ట్రంప్.. 'మీ రాజకీయ కెరీర్‌కు ఇదే ఆరంభం' అని అన్నారు. అందుకు మెటా అధినేత స్పందిస్తూ.. 'కాదు కాదు' అని అనడంతో అక్కడున్న వారంతా నవ్వులు చిందించారు.

## ఆయన పిలిచారు.. ప్రతినిధి వెళ్లాడు: మస్క్



అమెరికాలోని ప్రముఖ టెక్ సంస్థల అధిపతులు, సీఈవోలకు ఆ దేశ అధినేత డొనాల్డ్ ట్రంప్ విందు ఇచ్చారు. ఇందులో ట్రంప్ ఒకప్పటి సన్నిహితుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ లేకపోవడం చర్చనీయాంశమైంది. విందుకు రావాలంటూ మస్క్‌కు అసలు ఆహ్వానమే అందలేదంటూ వస్తున్న వార్తలను తాజాగా మస్క్ ఖండించారు. 'నాకు ఆహ్వానం అందింది. కానీ, దురదృష్టవశాత్తు హాజరు కాలేకపోయాను.

నా ప్రతినిధి అక్కడున్నారు' అని మస్క్ పేర్కొన్నారు. అయితే, నిజంగానే మస్క్ ప్రతినిధి ఒకరు ఈ విందులో పాల్గొన్నారా? అనే విషయం తెలియలేదు. ఆహ్వానం అందినప్పటికీ టెస్లా అధినేత హాజరుకాక పోవడంపై నెట్టింట చర్చ మొదలైంది. విందులో మస్క్ ప్రత్యర్థి, ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ కూడా పాల్గొన్నారు.

ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత మస్క్‌కు డోజ్ బాధ్యతలు అప్పగించారు. తర్వాత కొంతకాలానికే ఇరువురి మధ్య విబేధాలు మొదలయ్యాయి. అమెరికా ప్రభుత్వం రూపొందించిన 'బిగ్ బ్యూటిఫుల్' బిల్లును వ్యతిరేకించడంతో అవి మరింత పెరిగాయి. ఈక్రమంలో బహిరంగంగానే పరస్పర విమర్శలు చేసుకున్నారు. మస్క్ కొత్త పార్టీని కూడా ప్రకటించారు. ఆ తర్వాత ట్రంప్‌పై తాను చేసిన వ్యాఖ్యలకు మస్క్ పశ్చాత్తాపం వ్యక్తం చేయడం గమనార్హం.

## థాయ్ కొత్త ప్రధాని అనుతిన్



*థాయ్‌లాండ్ తదుపరి ప్రధానిగా అనుతిన్ చార్న్‌విరాకుల్‌ను అక్కడి పార్లమెంట్ ఎన్నుకుంది. మాజీ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రను అక్కడి రాజ్యాంగ న్యాయస్థానం పదవినుంచి తొలగించిన నేపథ్యంలో కొత్త ప్రధాని ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. భూమ్‌జైతై పార్టీకి చెందిన అనుతిన్.. షినవత్ర నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో పనిచేశారు. గత రెండేళ్లలోనే థాయ్‌లాండ్‌కు మూడో ప్రధాని రావడం గమనార్హం.*

*కంబోడియా సెనేట్ అధ్యక్షుడు హన్‌సేన్‌తో థాయిలాండ్ ప్రధాని షినవత్ర ఫోనులో మాట్లాడడం సంచలనం రేపింది.*

*ఇరుదేశాల మధ్య సరిహద్దు వివాదాలు తీవ్రంగా ఉన్న సమయంలో పొరుగుదేశం నేతతో కీలక విషయాలు పంచుకున్న తీరు వివాదాస్పదమైంది.*

*దానిపై విచారణ జరిపిన దేశ రాజ్యాంగ న్యాయస్థానం షినపత్ర తీరు నైతిక ప్రమాణాలను ఉల్లంఘించడమేనని తేల్చి చెప్పింది.*

*రాజ్యాంగం ప్రకారం ఇటువంటి వారికి ప్రధానిస్థానంలో ఉండే అర్హత లేదని పేర్కొంటూ ఆమెను పదవినుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించడం తెలిసిందే.*

చైతన్యరథం



# జగదీశన్ డబుల్ సెంచరీ మిస్

**- తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ 536 ఆలవుట్**
**- దులీప్ ట్రోఫీ సెమీఫైనల్స్**

దులీప్ ట్రోఫీ-2025 సెమీఫైనల్లో భాగంగా బెంగళూరు వేదికగా నార్త్ జోన్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌత్ జోన్ ఓపెనర్, తమిళనాడు స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ నారాయణ్ జగదీశన్ దురదృష్టవశాత్తూ తృటిలో డబుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. మరో మూడు పరుగులు చేస్తే ద్విశతకం అందుకునే దశలో జగదీశన్ రనౌట్ అయ్యాడు. రెండోరోజు శుక్రవారం ఆట ముగిసే సరికి సౌత్ జోన్ 169.2 ఓవర్లలో 536 పరుగులకు ఆలవుట్ అయింది. అప్పటికే సమయం ముగియటంతో నార్త్ జోన్ బ్యాటింగ్‌కు రాకుండానే మ్యాచ్ నిలిపివేశారు.

148 పరుగులతో రెండో రోజు బ్యాటింగ్ మొదలు పెట్టిన జగదీశన్.. ఆచితూచి ఆడుతూ స్కోర్ బోర్డును ముందుకు నడిపించాడు. సునాయాసంగా డబుల్ సెంచరీ అందుకునేలా కనిపించిన జగదీశన్ 197 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద .. నార్త్ జోన్ ఆటగాడు నిశాంత్ సింధు విసిరిన అద్భుత త్రోకు బలయ్యాడు. జగదీశన్ ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. సౌత్ జోన్ బ్యాటర్లలో తన్మయ్ అగర్వాల్ 43, దేవదత్ పడిక్కల్ 57, రికీ బూయ్ 54, తనయ్ త్యాగరాజన్ 58 పరుగులు చేశారు.

నార్త్ జోన్ బౌలర్లలో నిశాంత్ సింధు 5 వికెట్లతో సత్తా చాటాడు. అన్షుల్ కాంబోజ్ 2, మయాంక్ డాగర్, సాహిల్ లోత్రా చెరో వికెట్ తీశారు.

**దీటుగా బదులిస్తున్న సెంట్రల్**

బెంగళూరులోనే జరుగుతున్న మరో సెమీఫైనల్లో (దులీప్ ట్రోఫీ-2025) వెస్ట్‌జోన్‌కు సెంట్రల్ జోన్ దీటుగా బదులిస్తోంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్ట్‌జోన్.. రుతురాజ్ గైక్వాడ్ భారీ సెంచరీ (184) సాయంతో 438 పరుగులకు ఆలౌట్ అయింది. ఆర్య దేశాయ్ 39, తనుష్ కొటియాన్ 76, శార్దూల్ ఠాకూర్ 64 పరుగులు చేశారు.

సెంట్రల్ జోన్ బౌలర్లతో సారాంశ్ జైన్, హర్ష్ దూబె మూడేసి వికెట్లు తీయగా, ఖలీల్ అహ్మద్ 2, దీపక్ చాహర్ 1 వికెట్ తీశారు.

తరువాత బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ రెండోరోజు శుక్రవారం ఆటముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. రజత్ పటీదార్ 47 (59 బంతులు), శుభం శర్మ (148) పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఓపెనర్లు ఆయుష్ పాండే 40 (59), డానిష్ మలేవార్ (136) పరుగులు చేశారు.

**27 ఏళ్ల తరువాత..**

# ఇంగ్లాండ్‌లో వన్డే సిరీస్ గెలిచిన సౌతాఫ్రికా

**- రెండో మ్యాచ్‌లో 5 పరుగులతో విజయం**
**- మూడు మ్యాచ్‌ల సిరీస్ 2-0తో కైవసం**

ఇంగ్లండ్ గడ్డ మీద తెంబా బవుమా నాయకత్వంలోని సౌతాఫ్రికా క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇరవై ఏడేళ్ల తర్వాత తొలిసారి ఇంగ్లండ్‌లో ఆతిథ్య జట్టుపై వన్డే సిరీస్ గెలిచింది. మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లు ఆడేందుకు సౌతాఫ్రికా.. ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లింది. ఈ క్రమంలో తొలుత వన్డే సిరీస్ మొదలుకాగా.. మంగళవారం లీడ్స్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఇంగ్లండ్‌ను ఏడు వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తాజాగా లండన్‌లోని లార్డ్స్ వేదికగా గురువారం జరిగిన రెండో వన్డేలో 5 పరుగుల తేడాతో గెలిచిన సౌతాఫ్రికా మరో మ్యాచ్ మిగిలుండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో గెలుచుకుంది.



**బ్రీజ్కే, స్టబ్స్ హాఫ్ సెంచరీలు**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు ఐడెన్ మార్క్రమ్ (49), రియాన్ రికెల్టన్ (35) శుభారంభం అందించగా.. వన్డేన్ బ్యాటర్, కెప్టెన్ తెంబా బవుమా (4) మాత్రం నిరాశపరిచాడు. ఇక మిడిలార్డర్‌లో కీలకమైన నాలుగో స్థానంలో వచ్చిన మాథ్యూ బ్రీజ్కే మరోసారి అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మొత్తంగా 77 బంతులు ఎదుర్కొని ఏడు ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో 85 పరుగులు చేశాడు. అతడికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్ (58), డెవాల్డ్ బ్రెవిస్ (42), కార్బిన్ బాష్ (32 నాటౌట్) రాణించారు. ఈ క్రమంలో నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లు నష్టపోయిన సౌతాఫ్రికా 330 పరుగులు సాధించింది.

ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ నాలుగు వికెట్లు దక్కించుకోగా.. ఆదిల్ రషీద్ రెండు, జేకబ్ బెతెల్ ఒక వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు.

**చివరి వరకు పోరాడినా..**

ఇక లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ ఆఖరి వరకు పోరాడినా ఫలితం లేకుండా పోయింది. చివరికి సౌతాఫ్రికా ఐదు పరుగుల తేడాతో గెలుపొందింది. ఇంగ్లండ్ ఓపెనర్లు జేమీ స్మిత్ (0), బెన్ డకెట్ (14) విఫలం కాగా.. వన్‌డౌన్‌లో వచ్చిన జో రూట్ (61), నాలుగో నంబర్ బ్యాటర్ జేకబ్ బెతెల్ (58) అర్ధ శతకాలతో రాణించారు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ 33 పరుగులు చేయగా.. మాజీ సారథి జోస్ బట్లర్ హాఫ్ సెంచరీ (61)తో అదరగొట్టాడు. ఇక విల్ జాక్స్ 39 పరుగులు చేయగా.. ఆర్చర్ ఆఖర్లో మెరుపు ఇన్నింగ్స్ (14 బంతుల్లో 27 నాటౌట్) ఆడాడు. చివరి ఓవర్లో ఇంగ్లండ్ గెలుపునకు 16 పరుగులు అవసరం కాగా.. సకీబ్ మహమూద్ (2 నాటౌట్), ఆర్చర్ విజయం దిశగా జట్టును తీసుకెళ్లారు. తొలి బంతికి సకీబ్ ఒక పరుగు తీయగా.. మూడో బంతికి ఆర్చర్ ఫోర్ కొట్టాడు. మరలా ఐదో బంతిని బౌండరీకి తరలించాడు. ఆఖరి బంతికి ఆరు పరుగులు చేస్తే సూపర్ ఓవర్ అవసరమయ్యేది. అయితే సేన్ ముత్తుస్వామి వేసిన అద్భుత బంతికి ఆర్చర్ ఒక్క పరుగు మాత్రమే తీయగలిగాడు. ఫలితంగా ఐదు పరుగుల తేడాతో గెలిచిన సౌతాఫ్రికా.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ సొంతం చేసుకుంది.

**బ్రీజ్కేప్రపంచ రికార్డు.. బవుమా బృందం సరికొత్త చరిత్ర**

కాగా వన్డేల్లో ఆడిన తొలి ఐదు మ్యాచ్లలో 50 ప్లస్ స్కోర్లు సాధించిన ఆటగాడిగా మాథ్యూ బ్రీజ్కే ప్రపంచ రికార్డు సాధించాడు. ఇప్పటి వరకు ఆడిన ఐదు వన్డేల్లో కలిపి అతడు 463 పరుగులు చేశాడు.

# చిక్కుల్లో ఇంగ్లాండ్..

**- వన్డే ప్రపంచకప్-2027కు నేరుగా అర్హత సాధించటంపై అనుమానాలు**

వన్డే ప్రపంచ కప్ మొదలయ్యేందుకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ ఇంగ్లాండ్ క్రికెట్ జట్టులో ఆందోళన మొదలైంది. దక్షిణాఫ్రికా చేతిలో సిరీస్‌ను కోల్పోవడమే అందుకు కారణం. దీంతో ఐసీసీ వన్డే ప్రపంచకప్-2027కు ఇంగ్లాండ్ జట్టు నేరుగా ఆర్హత సాధిస్తుందా? లేదా క్వాలిఫయింగ్ రౌండ్లో ఆడాల్సి వస్తుందా అన్న చర్చ ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో నెలకొంది. ఇటీవల కాలంలో ఇంగ్లండ్ జట్టు దారుణ ప్రదర్శన ఇందుకు కారణం. టీ20, టెస్టుల్లో పర్వాలేదన్పిస్తున్న ఇంగ్లీష్ జట్టు.. వన్డేల్లో మాత్రం పూర్తిగా తెలిపోతోంది.

2019 ఛాంపియన్స్ అయిన ఇంగ్లండ్ ప్రస్తుతం వరుస ఓటములతో సతమతమవుతోంది. తాజాగా గురువారం లార్డ్స్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో 5 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఓటమి పాలై 2-0 తేడాతో సిరీస్‌ను కోల్పోయింది. 1998 తర్వాత సౌతాఫ్రికాపై ఇంగ్లండ్ వన్డే సిరీస్‌ను కోల్పోడం ఇదే తొలిసారి.

వన్డే ప్రపంచకప్-2023 తర్వాత ఇప్పటివరకు 21 వన్డేలు ఆడిన ఇంగ్లాండ్ కేవలం 7మాత్రమే గెలిచింది. ఈ ఫలితాలు బట్టి వన్డే ఫార్మాట్‌లో ఇంగ్లాండ్ ప్రదర్శన ఎలా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో కూడా ఇంగ్లాండ్ గ్రూపు స్టేజిలోనే ఇంటిముఖం పట్టింది.

దీంతో జోస్ బట్లర్ కెప్టెన్సీ తప్పుకొన్నాడు. అతడి స్థానంలో యువ ఆటగాడు హ్యారీ బ్రూక్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. అయినప్పటికి ఇంగ్లీష్ జట్టు తలరాత మారలేదు. ఇప్పుడు సౌతాఫ్రికాతో సిరీస్‌ను కోల్పోవడంతో 2027 వరల్డ్ కప్ కు నేరుగా అర్హత సాధించే అవకాశాలను ఇంగ్లండ్ సంక్లిష్టం చేసుకుంటోంది.

**బరిలోకి 14 జట్లు..**

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా 2027 వన్డే ప్రపంచకప్ నకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. తొలి రెండు జట్లకు నేరుగా అర్హత లభిస్తుంది. నమీబియా పూర్తిస్థాయి సభ్యదేశం కాకపోవడంతో.. ఆ జట్టు క్వాలిఫయర్స్‌లో ఆడి రావాల్సి ఉంది. ఐసీసీ ర్యాంకుల్లో తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన జట్లకు డైరెక్ట్ ఎంట్రీ ఉంటుంది. మిగతా జట్లు క్వాఫలియర్స్‌లో ఆడి రావాలి. వన్డే ప్రపంచకప్-2027కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమివ్వనున్నా యి. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. వీటిని రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతీ గ్రూపులో ఏడు జట్లు చొప్పున ఉంటాయి. ఇందులో ఎనిమిది జట్లు ర్యాంకింగ్‌ల ద్వారా, మరో రెండు జట్లు ఆతిథ్య హోదాలో అర్హత సాధిస్తాయి. మరో నాలుగు జట్లు క్వాలిఫయర్ రౌండ్స్ నుంచి ప్రధాన టోర్నీలో అడుగుపెడతాయి. ఆతిథ్య హోదాలో దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఆటోమేటిక్ ఆర్హత సాధిస్తాయి. అయితే నమీబియా ఆతిథ్యమిస్తున్నప్పటికి ఇంకా ఐసీసీ సభ్య దేశం కాకపోవడంతో క్వాలిఫయర్స్ ఆడాల్సిందే.

**ఆఖరి స్థానంలో ఇంగ్లండ్..**

ఇక ప్రస్తుతానికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో భారత్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, దక్షిణాఫ్రికా, పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్, ఇంగ్లండ్ ఉన్నాయి. సౌతాఫ్రికా ఎలాగూ నేరుగా ఆర్హత సాధిస్తుంది కాబట్టి ర్యాంకింగ్‌తో సంబంధం లేదు. అయితే ఇంగ్లండ్ మాత్రం 86 రేటియింగ్ పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది.

ఇంగ్లాండ్ తర్వాతి స్థానంలో వెస్టిండీస్ (80), బంగ్లాదేశ్(77) ఉన్నాయి. ఇంగ్లాండ్, విండీస్, బంగ్లాదేశ్ మధ్య పెద్దగా రేటింగ్ పాయింట్లు తేడా లేవు. ఇప్పటినుంచైనా వన్డేల్లో మెరుగైన ప్రదర్శన చేయకపోతే ఇంగ్లాండ్ పదో స్థానానికి పడిపోతుంది. దీంతో వన్డే ప్రపంచకప్-2027కు అర్హత సాధించేందుకు ఆ జట్టు క్వాలిఫయర్స్ పోటీలు ఆడాల్సి వుంటుంది. ఇప్పుడు దక్షిణాఫ్రికాతో చివరి వన్డేలోనూ ఇంగ్లాండ్ ఓడితే పాయింట్లపై ప్రభావం పడటం ఖాయం. ఒకవేళ రాబోయే సిరీస్‌ల్లో విజయాలు సాధిస్తే ఇంగ్లండ్ నేరుగా ఆర్హత సాధిస్తుంది. ప్రపంచకప్‌కు ముందు న్యూజిలాండ్, శ్రీలంక, భారత్‌తో ఇంగ్లాండ్ వన్డే సిరీలు ఆడనుంది. శ్రీలంకతో రెండు సార్లు వన్డే సిరీస్‌ల్లో ఇంగ్లాండ్ తలపడనుంది.

# చెదిరిన యూకీ గ్రాండ్‌స్లామ్ కల

**యూఎస్ ఓపెన్ డబుల్స్ సెమీస్‌లో ఓటమి**



భారత టెన్నిస్ ఆటగాడు యుకీ బాంబ్రీకి నిరాశ ఎదురైంది. కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ అందుకోవాలన్న అతడి కల సెమీస్‌తోనే ముగిసింది. యూఎస్ ఓపెన్- 2025 డబుల్స్ సెమీ ఫైనల్ పోరులో యుకీ - మైకెల్ వీనస్ జోడీ.. జో సలిస్బరీ-నీల్ స్కప్స్కి ద్వయం చేతిలో 7-6 (2), 6-7 (5), 4-6 తేడాతో ఓటమిపాలైంది. దాదాపు రెండు గంటల 53 నిమిషాలపాటు సాగిన పోరులో ప్రతి పాయింట్ కోసం ప్రత్యర్థులు తీవ్రంగా పోరాడారు.

**తొలుత ఆధిక్యం లభించినా..**

మొదటి సెట్ లో యుకీ జోడీ విజయం సాధించింది. రెండో సెట్లోనూ అదే పోరాటం ప్రదర్శించినా ఆఖర్లో తడబాటుతో కోల్పోవాల్సి వచ్చింది. ఇక మూడో సెట్‌కూడా హోరాహోరీగా సాగింది. ముందు దూకుడుగా ఆడిన యుకీ - మైకెల్ తర్వాత వెనుకడుగు వేశారు. 5-4తో ప్రత్యర్థి టీమ్ ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత బ్రేక్ పాయింట్‌ను సాధించడంలో విఫలమైన యుకీ జోడీకి ఓటమి తప్పలేదు. చివరికి 6-4 తేడాతో మూడో సెట్‌తో పాటు మ్యాచ్‌నూ కోల్పోవాల్సి వచ్చింది.

చైతన్య రథం
సినిమా
శనివారం 6 సెప్టెంబర్ 2025


# జోష్‌లో.. శంకరవరప్రసాదు టీం

అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి నటిస్తోన్న 'మన శంకరవరప్రసాదు గారు' చిత్రానికి సంబంధించి తాజా అప్‌డేట్‌తో సినిమా టీమ్ ఫుల్ జోష్ ఉంది. తాజా అప్‌డేట్‌ను చిత్రబృందం షేర్ చేసింది. కొత్త షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను పంచుకుంది. ఇప్పటికే ఈ సినిమా కేరళలో కొన్ని షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో షెడ్యూల్‌ను ప్రారంభించారు. నేటినుంచి సెప్టెంబర్ 19వరకూ చిత్రీకరణ జరగనుంది. ఇందులో చిత్రీకరించే రెండు పాటలు కొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని చిత్రబృందం చెబుతోంది. 2026 సంక్రాంతికి ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ ఖాయమంటోంది టీమ్. వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. తాజాగా సాహు గారపాటి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అక్టోబర్ 5నుంచి నిర్వహించనున్న మరో షెడ్యూల్లో వెంకటేశ్ భాగం కానున్నట్టు తెలిపారు. వచ్చే ఏడాది చిరంజీవి వరుసగా రెండు సినిమాలతో అలరించనున్నారు. ఏడాది ప్రారంభంలో సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు'తో సందడి చేసేందుకు సిద్ధమవుతుండగా.. వేసవిలో 'విశ్వంభర'తో పలకరించనున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా "విశ్వంభర" ముస్తాబవుతోంది.



# శిల్పా జంటకు లుకౌట్ నోటీసు?



బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, రాజ్‌కుంద్రా దంపతులపై ముంబయి పోలీసులు లుకౌట్ సర్క్యులర్ జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఓ వ్యాపారిని రూ.60 కోట్లమేర మోసం చేసిన కేసులో నిందితులుగా ఉన్న జంటకు నోటీసులు ఇవ్వనున్నట్టు సమాచారం. వాణిజ్య ఒప్పందంతో ముడిపడివున్న వ్యవహారంలో ముంబయికి చెందిన వ్యాపారవేత్తను రూ.60 కోట్లమేర మోసం చేశారన్న అభియోగాలతో వీరిపై గతంలో కేసు నమోదైంది. ఆర్థిక నేరాల విభాగం వివరాల ప్రకారం పోలీసులు ప్రస్తుతం ఈ జంట ట్రావెల్ లాగ్‌లను పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ సంస్థ ఆడిటర్‌ను సైతం విచారించినట్టు సమాచారం. కేసు విచారణ సమయంలో దేశం విడిచిపోకుండా ఉండేందుకు లుకౌట్ సర్క్యులర్ జారీ చేస్తుంటారు. ఒప్పందానికి సంబంధించి రూ.60 కోట్లు మోసం చేశారని శిల్పాశెట్టి, రాజ్ కుంద్రాలపై దీపక్ కొఠారి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు జుహు పోలీసులు ఆగస్టు 14న కేసు నమోదు చేశారు. ఓవైపు దీనిపై విచారణ జరుగుతుండగా శిల్పా దంపతులు తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తున్నారని.. అందుకే లుకౌట్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమైనట్టు సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు.


## హిందీలోనూ పాగా వేయనుందా?

టాలీవుడ్‌లో వరుస ఆఫర్లు దక్కించుకుంటూ హిట్స్ అందుకుంటున్న యంగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి ప్రస్తుతం హాట్ ఫేవరెట్ బ్యూటీగా మారింది. ఈమె పట్టిందల్లా హిట్టేనన్న తీరులో చేస్తున్న ప్రతి సినిమా కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి గుర్తింపు దక్కించుకుంటోంది. అయితే స్టార్ హీరోలతోపాటు యంగ్ హీరోల చిత్రాల్లోనూ అమ్మడు ఛాన్సులు దక్కించుకుంటూ దూసుకెళ్తోంది. కాగా, ఇప్పుడు ఈ బ్యూటీ చూపులు బాలీవుడ్‌పై పడినట్టు తెలుస్తోంది. అందరి హీరోయిన్ల మాదిరే ఈ బ్యూటీ కూడా బాలీవుడ్‌లో ఛాన్స్‌కోసం ఎదురు చూస్తోందట. అయితే, బాలీవుడ్ హీరో జాన్ అబ్రహాం హీరోగా తెరకెక్కనున్న 'ఫోర్స్-3' సినిమాలో హీరోయిన్‌గా నటించే ఛాన్స్ బ్యూటీకి దక్కినట్టు సమాచారం. దీనికి మీనాక్షి కూడా ఓకే చెప్పినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. మరి మీనాక్షి బాలీవుడ్ డ్రీమ్ ఎంతవరకు సక్సెస్ అవుతుందనేది సినిమా రిలీజ్ అయ్యాకే తెలుస్తోంది.



## టాలీవుడ్‌లో మళ్లీ ధనుష్ సినిమా

తమిళ హీరో ధనుష్ ఎంచుకునే సినిమాలకు ప్రత్యేక ఫాలోయింగ్ ఉంటుంది. ఆయన చేసే సినిమాలకు తమిళ్‌తోపాటు తెలుగులోనూ మంచి క్రేజ్ ఉంది. ఇక ఆయన నేరుగా తెలుగులో చేసిన సినిమాలకు ఇక్కడి జనం సాలిడ్ రెస్పాన్స్ అందించారు. సార్, కుబేర చిత్రాలతో ధనుష్ తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యాడు. అయితే ఇప్పుడు ముచ్చటగా మూడో తెలుగు చిత్రానికి ధనుష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సినీ సర్కిల్స్‌లో వినిపిస్తోన్న మాట. తెలుగు డైరెక్టర్ వేణు ఉడుగుల చెప్పిన కథ నచ్చి ధనుష్ సినిమాను చేసేందుకు ఓకే చెప్పాడట. నీది నాది ఒకే కథ, విరాటపర్వం సినిమాలతో వేణు ఉడుగుల మంచి గుర్తింపు సాధించారు. మరి ఇప్పుడు ధనుష్ కోసం ఆయన ఎలాంటి కథను రెడీ చేశాడో చూడాలి. ఇక ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ ప్రొడ్యూస్ చేయనుందని తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# రుక్మిణి.. స్టార్ మామూలుగా లేదుగా



కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ కెరీర్ ఇప్పుడు జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తోంది. 'సప్తసాగరాలు దాటి'తో ఒక్కసారిగా నేషనల్ లెవెల్‌లో గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడికి, స్టార్ హీరోల సినిమాల్లో ఆఫర్స్ వచ్చి పడడం విశేషం. సక్సెస్‌కంటే ఎక్కువగా ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, చార్మింగ్ లుక్స్‌నే ఫిలిం మేకర్స్ నమ్ముతున్నారనేది నిజం. ఇప్పటికే రుక్మిణి చేతిలో పాన్ ఇండియా రేంజ్ ప్రాజెక్టులు ఉన్నాయి. 'కాంతార-1'లో కీలక పాత్ర, ఎన్టీఆర్-నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్', యష్ హీరోగా తెరకెక్కుతున్న 'టాక్సిక్'వంటి సినిమాలు ఆమె లైనప్‌లో ఉండటం గ్లామర్‌తో పాటు క్రేజ్ కూడా పెంచేసింది. కానీ ఈ క్రేజీ ఆఫర్స్‌కంటే ముందు రుక్మిణి లైమ్‌లైట్‌లోకి తెచ్చేది మదరాసి. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ సరసన నటించిన ఈ సినిమా ఇప్పటికే విడుదలైంది. ఈ మూవీ సక్సెస్ అవుతుందో లేదో అనేది మాత్రమే కాకుండా, రుక్మిణి కెరీర్ టర్నింగ్ పాయింట్ అవుతుందా? అనే ఆసక్తి కూడా ఉంది. మదరాసి హిట్ కొడితే.. రుక్మిణి వసంత్ ఇక వెనక్కి తిరిగి చూసుకునే పనుండదు.

# యాక్షన్ మొత్తం రిషబ్‌దేనట!

కన్నడ నటుడు రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'కాంతార చాప్టర్ 1'. 2022లో వచ్చిన 'కాంతార'కు ప్రీక్వెల్‌గా ఇది సిద్ధమవుతోంది. రిషబ్ స్వీయ దర్శకత్వంలో ముస్తాబవుతోన్న సినిమా అక్టోబర్-2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా స్టంట్ కొరియోగ్రాఫర్ అర్జున్ రాజ్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలను రిషబ్ స్వయంగా చేశారని తెలిపారు. "ఒక్క యాక్షన్ సన్నివేశంలో కూడా డూప్ ఉపయోగించలేదు. రిషబ్ రిస్క్ చేసి ఎన్నో స్టంట్స్ చేశారు. ఆయన కెరీర్‌లో ఇప్పటి వరకూ చేయని యాక్షన్ సన్నివేశాలను కూడా డూప్ లేకుండా చేశారు. కత్తి యుద్ధం, గుర్రపు స్వారీలతోపాటు యుద్ధకళగా ప్రాచుర్యం పొందిన కలరిపయట్టులోనూ శిక్షణ తీసుకున్నారు. నేను ఇప్పటి వరకూ చాలా మంది నటులతో వర్క్ చేశాగానీ రిషబ్‌లాంటి హీరోను చూడలేదు. 'నేను నా శాయశక్తులా ప్రయత్నిస్తాను అని అనడు.. నేను బ్రతికి ఉన్నంత వరకూ దీన్ని చేస్తాను' అని చెబుతాడు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి" అంటూ స్టంట్ కొరియోగ్రాఫర్ అర్జున్ రాజ్ హీరో రిషబ్‌పై ప్రశంసలు కురిపించారు.

